విశాఖపట్టణం
శుక్రవారం 11 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 210 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# నాలుగు రోజులు బ్యాంక్ క్లోజ్

**నేడు బ్యాంకింగ్ ఉద్యోగుల సమ్మె**

**మూడు రోజుల వరుస సెలవులు**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)




దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ ఉద్యోగులు శుక్రవారం సమ్మెకు పిలుపునిచ్చారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమ్మె వల్ల ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సేవలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. 5 రోజుల పనిదినాలు: వారానికి 5 రోజుల పనిదినాల విధానాన్ని వెంటనే అమలు చేయాలని బ్యాంక్ ఉద్యోగులు డిమాండ్ ..మిగతా 2లో



# తవ్వేకొద్దీ అక్రమాలు

**నిరుద్యోగులకు ఘరానా మోసం**

**మెగా డీఎస్సీ పేరుతో దగా చేసారు**

**స్పోర్ట్స్ కోటా పేరుతో ఉద్యోగాలు అమ్మకం**

**కూటమి ప్రభుత్వ అవినీతిని వదిలిపెట్టం**

**కోర్టుల్లోనూ, ప్రజాక్షేత్రంలో పోరాడుతాం**

**వైఎస్సార్ సీపీ అధినేత జగన్ కీలక వ్యాఖ్యలు**

(తాడేపల్లి - జయజయహే)

కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ-2025 నిరుద్యోగులను, నిజాయితీపరులైన అభ్యర్థులను ఘోరంగా దగా చేసిన అతిపెద్ద కుంభకోణమని వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ స్కామ్‌కు సంబంధించిన నివ్వెరపోయే వాస్తవాలు, పక్కా సాక్ష్యాలను తవ్వేకొద్దీ బయటపడుతున్నాయని, అందుకే ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ, జర్నలిస్టుల నోళ్లు నొక్కుతూ, సోషల్ మీడియా ఖాతాలను ..మిగతా 2లో

# ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాలి

**స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ సిద్ధం కావాలి**

**ప్రతీ జిల్లాకు మూడు నెలల యాక్షన్ ప్లాన్**

**ఎల్ నినోతో తాగునీటి సమస్య రాకూడదు**

**సీఎం చంద్రబాబు ఆదేశాలు**

**కలెక్టర్ల సదస్సులో కీలక మార్గదర్శకాలు**






(అమరావతి - జయజయహే)

భూమి కొరతతో అభివృద్ధి ఆగకుండా రాష్ట్రంలోని నిరుపయోగ ప్రభుత్వ భూములన్నింటి లెక్క తేల్చి స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రాజెక్టు మంజూరయ్యాక భూమి కోసం వెతకుండా ముందుగానే ల్యాండ్‌ను గుర్తించి సిద్ధంగా ఉంచేలా వ్యవస్థను మార్చాలని స్పష్టం చేశారు. ఎస్సీలకు అందుతున్న ప్రయోజనాలను బుడగ జంగాలకు కూడా వర్తింపజేసేలా తక్షణ ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశాలిచ్చారు. ప్రతి శాఖ, ప్రతి జిల్లాకు మూడు నెలల యాక్షన్ క్యాలెండర్ రూపొందించి గడువులోగా ఫలితాలు సాధించాలని చంద్రబాబు పేర్కొన్నారు. యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌పై సమీక్షలో బుడగ జంగాలకు ఎస్సీల ప్రయోజనాలు, నైపుణ్యాభివృద్ధి, గృహాల నిర్మాణం, తాగునీటి అత్యవసర పనులు, 50 శాతం హరిత ప్రాంతం లక్ష్యంగా మొక్కల పెంపకం సహా పలు అంశాలను వేగంగా అమలు చేయాలని సీఎం తేల్చి చెప్పారు. ఇప్పటికే మంజూరైన గృహాలను వేగంగా పూర్తి చేయడంతో పాటు అదనంగా రానున్న లక్షన్నర ఇళ్లను దశలవారీగా అమలు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి అత్యవసర పనులకు వేగం పెంచాలని చంద్రబాబు ఆదేశించారు. 50 శాతం హరిత ప్రాంతం లక్ష్యంగా 20 కోట్ల విత్తనాలు, మొక్కలను ప్లాంటేషన్ సీజన్‌కు ముందే సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. తక్కువ నీటితో పెరిగే మొక్కలు, నీటి సంరక్షణ పనులు, ..మిగతా 2లో

# బోరున ఏడ్చేసిన బొత్స..!

**సముదాయించిన నేతలు**

**కార్యాకర్తల సమావేశంలో భావోద్వేగం**

**మేనల్లుడు చిన్నశ్రీను పార్టీ మార్పుపై మనస్తాపం**

(విజయనగరం - జయజయహే)



మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కన్నీళ్లు పెట్టుకున్నారు. గురువారం చీపురుపల్లి కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యకర్తల సమక్షంలోనే బొత్స సత్యనారాయణ భావోద్వేగానికి గురయ్యారు. తన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు పార్టీ మార్పు అంశం సమావేశంలో ప్రస్తావనకు రాగా.. బొత్స ఏడ్చేశారు. ఈ సందర్భంగా మజ్జితో ఉన్న అనుబంధాన్ని నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకుంటుండగా.. ఈ సమయంలో బొత్స ఉన్నట్టుండి భావోద్వేగానికి లోనయ్యారు. దీంతో నాయకులు, కార్యకర్తలు ఆయను ..మిగతా 2లో



# ఇది అత్యంత తీవ్రమైన కేసు

**సమాంతర విచారణ జరిగితే మంచిదే కదా**

**జడ్జిలు, నిందితులతో సీజేఐ వ్యాఖ్యలు**

**ముందస్తు బెయిల్ పిటీషన్ కొట్టివేత**

**లిక్కర్ స్కామ్‌లో విచారణలో సుప్రీంకోర్టు**

2



# ఎన్నికలకు కసరత్తు ముమ్మరం

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సన్నద్ధం**

**15 ఫొటోలతో ఓటర్ల జాబితా ప్రకటన**

**19న పోలింగ్ కేంద్రాల ప్రకటన**

**ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు**

(అమరావతి - జయజయహే)

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను వేగవంతం చేస్తోంది. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ కేంద్రాల ఎంపికపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఫొటోలతో కూడిన పూర్తి స్థాయి ఓటర్ల ..మిగతా 2లో

# వారసుల కోసం వ్యూహం

**రాజకీయ భవిష్యత్తు కోసం ముందస్తు ప్రణాళిక**

**పార్టీలు మారేందుకు సన్నద్ధం.. నియోజకవర్గాల పెంపుపై ఆశలు**

**మహిళా రిజర్వేషన్లపైనా కలలు.. ఇప్పటి నుంచే కర్చీఫ్ వేసేందుకు కసరత్తు**

**ఉత్తరాంధ్ర అంతటా ఇదే తంతు**



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఖాళీ అవుతోందన్న సంకేతాలు రోజురోజుకూ మరింత బలపడుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల ఘోర పరాభవం తర్వాత ఉనికి కోల్పోతున్న వైఎస్ఆర్‌సీపీలో కొనసాగడం తమ రాజకీయ భవిష్యత్తుకే కాకుండా, తమ వారసుల అరంగేట్రానికి కూడా ముప్పు అని సీనియర్ నేతలు గ్రహించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఈ ఒక్క ఘటన ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వైఎస్ఆర్‌సీపీ అగ్రనేతలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లయింది. ప్రస్తుతం ఉత్తరాంధ్రకు ..మిగతా 2లో

# మూడు రోజులు భారీ వర్షాలు

**బంగాళాఖాతంలో అల్పపీడనం**

**14 వరకు కొనసాగనున్న వర్ష సూచన**

2



# ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాలి

మొదటి పేజీ తరువాయి...



ప్రీ-మాన్‌సూన్ డ్రై సోయింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న నిర్ణయాలకు ఇక గడువు పొడిగింపులు ఉండవని, యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లో కనిపించే ప్రతి పెండింగ్ అంశానికి వేగంగా పరిష్కారం చూపాలని కలెక్టర్లకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఇంకుడుగుంతల ప్రభావం ఇప్పుడిప్పుడే ఫలితాలు ఇస్తున్నాయని చంద్రబాబు అన్నారు. 36 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలని అనుకున్నామని చెప్పారు. అందుకు నిర్దిష్ట లక్ష్యాలు ఇచ్చామని బాధ్యతగా పని చేయాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. టెలీ కమ్యూనికేషన్‌లో నూతన సాంకేతికత వచ్చిందన్న సీఎం అమెరికా కంటే అత్యుత్తమ టెక్నాలజీ మనం వాడుతున్నామని పేర్కొన్నారు. రోడ్ గ్రిడ్‌లో ప్రపంచంలోని అతిపెద్ద దేశాల్లో రెండో స్థానంలో ఉన్నామని తెలిపారు. రోడ్ గ్రిడ్‌తో పాటు పోర్టులు, ఎయిర్‌పోర్టులు వస్తున్నాయని వివరించారు. నదుల అనుసంధానంతో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే ఏ సమస్యా ఉండదని చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.



# మూడు రోజులు భారీ వర్షాలు

## బంగాళాఖాతంలో అల్పపీడనం

## 14 వరకు కొనసాగనున్న వర్ష సూచన

(అమరావతి - జయజయహే)

ప్రజలకు వాతావరణ కేంద్రం ముఖ్యమైన సమాచారాన్ని అందించింది. రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తర బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న బంగ్లాదేశ్ తీర ప్రాంతాల్లో నెలకొన్న అప్పర్ ఎయిర్ సైక్లోనిక్ సర్క్యులేషన్ ప్రభావంతో ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడినట్లు అమరావతిలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఈ అల్పపీడన ప్రభావంతోనే రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురిసే అవకాశముంది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.... ఉత్తర కోస్తాంధ్రతో పాటు యానాం ప్రాంతాల్లో కొన్నిచోట్ల గురువారం భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వీటితో పాటు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు మరియు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. శుక్రవారం నాటికి ఈ వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఉత్తర కోస్తాంధ్ర, యానాం పరిసర ప్రాంతాల్లోని కొన్ని చోట్ల భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇక శుక్రవారం కూడా కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ పరిధిలో బలమైన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని అంచనా వేసింది. శనివారం రోజున కూడా ఇదే తరహా వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. వర్షాలతో పాటు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ బలమైన ఉపరితల గాలుల ప్రభావం సెప్టెంబర్ 14 వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొనసాగనుంది. వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పిడుగులు పడే సమయంలో చెట్ల కింద నిలబడవద్దని అధికారులు సూచిస్తున్నారు.

# వారసుల కోసం వ్యూహం

మొదటి పేజీ తరువాయి...

చెందిన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి కీలక నేతలు టీడీపీ, జనసేన అధిష్టానాలతో తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ వలసల వెనుక ఉన్న ప్రధాన రాజకీయ కారణం రాబోయే మహిళా రిజర్వేషన్లు, వారసత్వ రాజకీయం . 2029 నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలుకావడం ఖాయమని తేలడంతో పాటు, ఇటీవల టీడీపీ మహానాడులో మంత్రి నారా లోకేష్ బిల్లు పాస్ కాకపోయినా పార్టీ తరపున మహిళలకు 33% టికెట్లు కేటాయిస్తామని సంచలన ప్రకటన చేశారు. దీంతో తమ కుమార్తెలను లేదా కోడళ్లను రాజకీయ బరిలోకి దించాలనుకుంటున్న సీనియర్ నాయకులకు కూటమి పార్టీలే సురక్షితమైన, ఆశాజనకమైన వేదికలుగా కనిపిస్తున్నాయి. వైఎస్ఆర్‌సీపీ జెండాపై పోటీ చేస్తే భవిష్యత్తులో గెలిచే అవకాశాలు శూన్యమని, తమ వారసుల రాజకీయ జీవితాలు ప్రారంభంలోనే దెబ్బతింటాయని ఈ సీనియర్లు భావిస్తున్నారు. అందుకే, చిన్న శ్రీను తన కుమార్తెను జెడ్పీ చైర్‌పర్సన్‌గా నిలబెట్టే ముందస్తు వ్యూహంతో టీడీపీ పసుపు కండువా కప్పుకున్నట్లే.. మిగిలిన ముగ్గురు ఉమ్మడి జిల్లాల నేతలు కూడా తమ మహిళా వారసులను స్థానిక సంస్థలు, రాబోయే అసెంబ్లీ స్థానాలకు స్థిరపరచేందుకు కూటమి నేతలతో రాయబారాలు నెరుపుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం వైపు నుంచి కూడా ఈ వలసలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఏకపక్ష విజయాలు సాధించి, ప్రతిపక్షాన్ని క్షేత్రస్థాయి నుంచి పూర్తిగా తుడిచిపెట్టాలనేది కూటమి వ్యూహం. బలమైన ఓటు బ్యాంక్, సామాజిక వర్గ సమీకరణాలు ఉన్న వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల వారసులను చేర్చుకోవడం ద్వారా తమ గెలుపు అవకాశాలను మరింత సుగమం చేసుకోవచ్చని టీడీపీ-జనసేన వర్గాలు లెక్కిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ ఒక రకమైన శూన్యతలోకి జారుకుంటోందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరి, పార్టీ పునర్నిర్మాణంలో కొరవడిన దిశానిర్దేశం వల్ల విసిగిపోయిన నేతలు.. తమ వారసుల భవిష్యత్తును కాపాడుకునేందుకు పవర్ అండ్ ఫ్యూచర్ ఉన్న కూటమి వైపే మొగ్గు చూపుతున్నారు. రాబోయే స్థానిక పోరు నాటికి ఉత్తరాంధ్ర వైఎస్ఆర్‌సీపీ నుంచి మరిన్ని వికెట్లు పడటం, వారసుల రాజకీయ రంగానికి కూటమి వేదికగా మారడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

# నాలుగు రోజులు బ్యాంక్ క్లోజ్

మొదటి పేజీ తరువాయి...

చేస్తున్నారు. స్కేల్ ×ఒ, అంతకంటే ఎక్కువ కేడర్ అధికారుల కోసం తెచ్చిన పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ విధానంపై బ్యాంక్ ఉద్యోగుల అభ్యంతరాలు. పెన్షన్ సమస్యలు: పెన్షన్ సవరణలతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు డిమాండ్లను పరిష్కరించాలని బ్యాంక్ ఉద్యోగులు కోరుతున్నారు. సెప్టెంబర్ 11 శుక్రవారం సమ్మె జరగనుండగా, ఆ తర్వాతి రెండు రోజులు (శని, ఆదివారాలు) బ్యాంకులకు సాధారణ సెలవులు. అలాగే సెప్టెంబర్ 14న వినాయక చవితి సందర్భంగా హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై, చెన్నై తదితర ప్రాంతాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి. దీంతో వరుసగా 4 రోజుల పాటు బ్యాంకింగ్ లావాదేవీలపై ప్రభావం పడనుంది. సమ్మె నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు ముందస్తు ప్రకటన విడుదల చేసింది. అత్యవసర బ్యాంకింగ్ లావాదేవీలు ఉన్నవారు సమ్మె ప్రారంభం కాకముందే పూర్తి చేసుకోవాలని సూచించింది. డిమాండ్లు నెరవేరకపోతే సెప్టెంబర్ 28 నుంచి 3 రోజుల పాటు దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామని, అలాగే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని యూనియన్లు హెచ్చరించాయి. బ్రిక్స్ సదస్సును దృష్టిలో ఉంచుకుని సమ్మె విరమించుకోవాలని చీఫ్ లేబర్ కమిషనర్ ప్రతినిధులు కోరినప్పటికీ, 5 రోజుల పనిదినాలపై స్పష్టమైన నిర్ణయం వచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదని యూ ఎఫ్ బీయూ నాయకులు స్పష్టం చేశారు.



# ఎన్నికలకు కసరత్తు ముమ్మరం

మొదటి పేజీ తరువాయి...

జాబితాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల వివరాల్లో తప్పులు, పునరావృత నమోదులు, ఇతర అభ్యంతరాలు లేకుండా జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితాలను ప్రదర్శించనున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 14న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను సిద్ధం చేసి.. సెప్టెంబర్ 15న అధికారికంగా ప్రచురించనున్నారు. పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే తెలియజేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అభ్యంతరాలు, మార్పులు, చేర్పులపై వినతులను స్వీకరించనున్నారు. ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి వచ్చే సూచనలు, అభ్యంతరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేపట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీల భాగస్వామ్యానికి కూడా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రాధాన్యం ఇస్తోంది. సెప్టెంబర్ 16న రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాలు, ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి పార్టీల అభిప్రాయాలు, సూచనలను అధికారులు తెలుసుకోనున్నారు. ఆ తర్వాత పోలింగ్ కేంద్రాల తుది జాబితా ఖరారు చేసే ప్రక్రియ కొనసాగుతుంది. సెప్టెంబర్ 18న పోలింగ్ కేంద్రాల జాబితాకు జిల్లా కలెక్టర్ల ఆమోదం తీసుకోనున్నారు. అనంతరం సెప్టెంబర్ 19న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రచురించనున్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో మరో కీలక దశ పూర్తికానుంది. ఓటర్ల జాబితాల పరిశీలన నుంచి పోలింగ్ కేంద్రాల తుది ఖరారు వరకు ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పూర్తి చేసి, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. తాజా షెడ్యూల్‌తో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.



# బోరున ఏడ్చేసిన బొత్స..!

మొదటి పేజీ తరువాయి...

సముదాయించారు. తన మేనల్లుడు టీడీపీలో చేరడాన్ని బొత్స జీర్ణించుకోలేకపోతున్నారు. సొంత కుటుంబసభ్యుడు పార్టీని వదిలిపెట్టి వెళ్లడంతో ఇలా కార్యకర్తల సమావేశంలో భాగోద్వేగానికి గురయ్యారు. అయితే బొత్స, మజ్జి శ్రీనివాసరావు మధ్య గత కొంతకాలంగా విబేధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ గొడవలు మరింత ముదరడంతో మజ్జి శ్రీనివాసరావు వైసీపీని వీడి పసుపు కండువా కప్పుకున్నట్లు చెబుతున్నారు. టీడీపీలో చేరుముందు విజయనగరం వైసీపీ అధ్యక్షుడిగా మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు. అలాగే భీమిలి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా కూడా పనిచేస్తున్నారు. అయితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె అనుషను జడ్పీ చైర్ పర్సన్ అభ్యర్థిగా బరిలోకి దించనున్నట్లు బొత్స ప్రకటించారు. అయితే జడ్పీ ఎన్నికల్లో తన కుమార్తె సిరి సహస్రను పోటీలోకి దింపాలని మజ్జి శ్రీను భావిస్తున్నారు. ఈ విషయంలో ఇరువురు మధ్య విబేధాలు తలెత్తాయి. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తనకు చెప్పకుండా బొత్స ప్రకటన చేయడంపై మజ్జి శ్రీను అసంతృప్తికి గురయ్యారు. బొత్స ప్రకటనను వైసీపీ అధినాయకత్వం కూడా స్వాగతించడంతో ఆయన మనస్తాపానికి గురై పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆయన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. అనంతరం చంద్రబాబు సమక్షంలో తన కూతురితో కలిసి టీడీపీలో చేరారు. చంద్రబాబు పార్టీ కండువా కప్పి వారిద్దరిని సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో శ్రీనుకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయనగరం ఎంపీ లేదా జడ్పీ ఛైర్మన్ టికెట్ తన కుమార్తెకు ఇప్పించాలని ఆయన ప్రయత్నం చేస్తున్నారు. 2024 ఎన్నికలకు ముందే శ్రీను టీడీపీలో చేరతారనే ప్రచారం జరిగింది. కానీ కొన్ని కారణాల వల్ల అది నిలిచిపోయింది. టీడీపీలో చేరిన అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి సహకరించేందుకు చేరినట్లు తెలిపారు. గత రెండేళ్లల్లో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళ్తుందని, చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో పనిచేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంకా చాలామంది వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

# తవ్వేకొద్దీ అక్రమాలు

మొదటి పేజీ తరువాయి...

బ్లాక్ చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం రక్తాశ్రితమైన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. ఈ డీఎస్సీ స్కామ్‌కు మూలకారణం పారదర్శకతకు పాతిపెట్టడమేనని జగన్ విమర్శించారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా ప్రశ్నాపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలన్నింటినీ ఒకే ఒక్క వ్యక్తి చేతిలో ఎందుకు పెట్టారని నిలదీశారు. ఎస్సీఈఆర్టీ లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా చేసిన వ్యక్తికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చిందో, ఆ తర్వాత అతని ఐడీని బ్లాక్ చేసి మెరిట్ లిస్టులను ఎందుకు మార్చారో ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోయిందన్నారు. కనీసం టెట్ అర్హత లేనివారికి, ఒక కేటగిరీ మార్కులను మరో పోస్టుకు వర్తింపజేసి, చివరికి రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు పాతరేసి మరీ దొంగచాటుగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా పేరుతో జరిగిన అక్రమాలు ఈ స్కామ్‌లో మరీ దారుణమని జగన్ సంచలన ఆధారాలు బయటపెట్టారు. గతంలో ఉన్న 2% స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచి, పరీక్షలు కూడా లేకుండా నేరుగా ఉద్యోగాలు ఇచ్చేలా జీవో 4, 47లను తీసుకొచ్చి, పని పూర్తయ్యాక జీవో 23, 56లతో గేట్లు మూసేశారని ఆరోపించారు. ఖమ్మంలో జరగని సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో ఛాంపియన్‌షిప్-2013 పోటీలలో పాల్గొన్నట్లు ఏపీ జూడో అసోసియేషన్ ఇచ్చిన తప్పుడు సర్టిఫికెట్లతో ఏకంగా 39 మందికి పరీక్షలు లేకుండా టీచర్ పోస్టులు ఇచ్చారన్నారు. అసలు ఆ తేదీల్లో పోటీలే జరగలేదని తెలంగాణ, ఖమ్మం జూడో అసోసియేషన్లు రాతపూర్వకంగా స్పష్టం చేశాయని, ఆశ్చర్యకరంగా ఏపీ జూడో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నది లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్ అని జగన్ ఎత్తిచూపారు. అలాగే టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షుడిగా ఉన్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ద్వారా 38 మందికి, జరగని నేషనల్ ఖో-ఖో పోటీల పేరుతో మరికొందరికి పరీక్షలు లేకుండానే పోస్టులు కట్టబెట్టారని జగన్ ఆరోపించారు. విశాఖపట్నంలో యోగేశ్వర్‌రావు అనే అభ్యర్థికి, అతని చెల్లెలికి ఖో-ఖో బోగస్ సర్టిఫికెట్లతో ఎస్‌జీటీ పోస్టులు ఇచ్చారని, తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిలీజ్ చేసిన విజేతల జాబితాలో వీరి పేర్లే లేవని నిరూపించారు. కర్నూలు జిల్లాలో ఈడిగ ప్రభాకర్ అనే అభ్యర్థికి కనీస అర్హత మార్కులు రాకపోయినా, స్కూల్ అసిస్టెంట్ మార్కులను చూపిస్తూ ఎస్‌జీటీ పోస్టు కట్టబెట్టిన తీరును డీఈవో కూడా ఒప్పుకున్నారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తప్పుచేశారు కాబట్టే వారి కింద పనిచేసే అధికారుల విచారణతో బాధితులకు న్యాయం జరగదని జగన్ స్పష్టం చేశారు. అక్రమాలు బయటపడినా ఆడియో, వీడియో సాక్ష్యాధారాలు ఉన్నా కేసులను వీకర్ సెక్షన్ల కింద నమోదు చేసి, స్టేషనల్ బెయిళ్లతో మసిపూసి మారేడుకాయ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ఈ మెగా డీఎస్సీ కుంభకోణంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, నిజాయితీగా కష్టపడిన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్‌సీపీ కోర్టుల్లోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాడుతుందని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఇది అత్యంత తీవ్రమైన కేసు

## లిక్కర్ స్కామ్ లో విచారణలో సుప్రీంకోర్టు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

లిక్కర్ రవాణా కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. ముందస్తు బెయిల్ కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నారని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. ఈడీ కస్టడీ నుంచి తిరిగి సిట్ కస్టడీకి తీసుకోవాలని సూచించింది. ఇది అత్యంత తీవ్రమైన కేసని, ఇందులో రాజ్ కసిరెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నారని ధర్మాసనంలోని మిగిలిన జడ్జిలకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) కేసుతో పాటు ఇతర దర్యాప్తు సంస్థల కేసులు సమాంతరంగా విచారణ జరిపితే తప్పేమిటని నిందితుల తరపు న్యాయవాదులను సీజేఐ ప్రశ్నించారు. ఈడీ కస్టడీ ముగిసిన తర్వాత, సిట్ కస్టడీకి తీసుకునేందుకు ప్రొడక్షన్ వారెంట్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆ ప్రక్రియ ముగిసిన అనంతరం సంబంధిత కింది కోర్టులో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. మెరిట్స్ ఆధారంగా బెయిల్ దరఖాస్తును కోర్టు పరిశీలిస్తుందని తేల్చిచెప్పింది.

## మాజీ సీఎం జగన్‌ని కలిసిన

# విశాఖ వైఎస్సార్‌సీపీ నాయకులు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 10, జయ జయహే**

: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జగన్ ని కలసిన వారిలో విశాఖకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కేకే రాజు, మాజీ మంత్రి చెల్లుబోయిన గోపాలకృష్ణ, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త దేవన్ రెడ్డి, విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రచార కమిటీ అధ్యక్షులు జీవీ రవి రాజు, దల్లి రామకృష్ణ రెడ్డి, బోరా కుమార్ రెడ్డి, వి. శివ కుమార్ రెడ్డి, తదితరులున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై వైఎస్



జగన్‌మోహన్ రెడ్డితో నాయకులు చర్చించారు. వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా నిలవాలని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-I ఉచిత శిక్షణ దరఖాస్తుకు గడువు పెంపు

### మైనారిటీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

### మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు

**అమరావతి,సెప్టెంబరు 10 (జయ జయహే)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్-2026ను అనుసరించి గ్రూప్-× పరీక్షలకు పోటీపడే మైనారిటీ అభ్యర్థులను ఉచిత శిక్షణకు ఎంపిక కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కు దరఖాస్తు గడువును పెంచినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం ) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని మంత్రి గుర్తు చేశారు.అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-1 సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు మొదట ఈనెల 10వ తేదీ వరకు గడువు నిర్దేశించడం జరిగిందన్నారు.దరఖాస్తు సమర్పణ గడువును 15 వ తేదీ వరకు పొడిగించామని మంత్రి తెలిపారు.ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అదనపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పొడిగించిన గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 సివిల్ పరీక్షకు హాజరుకావాలనుకునే మైనారిటీ అభ్యర్థులకు శ్రేష్ఠమైన శిక్షణ, మార్గదర్శకత్వం, సహకారాన్ని అందించడమే ఉచిత శిక్షణా కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.మరిన్ని వివరాల కోసం సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం),మైనారిటీ సంక్షేమ శాఖ,వెబ్‌సైట్: ష్ట్రజూం://ఖుజూఎవసఎఎమ్న.శితీస్త్ర ఫోన్: 08645-297535 / 7386789966. సంప్రదించాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.



# తాగునీటి కొరత లేకుండా చర్యలు

### మంత్రి నారాయణతో మాట్లాడిన గంటా

**విశాఖపట్నం, సెప్టెంబర్ 10:(జయ జయహే)**

మధురవాడ, భీమిలి జోన్ లలో తాగునీటి సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ అధికారులతో తాగునీటి ఎద్దడిపై ఆయన సమీక్ష నిర్వహించారు. తాటిపూడి రిజర్వాయర్ విషయంలో తాగు నీటికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విశాఖకు నీటి విడుదల అంశంపై విజయనగరం, విశాఖ జిల్లాల కలెక్టర్లు మాట్లాడుకుని ప్రాధాన్యాలు నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మంత్రి నారాయణకు వివరించి.. మధురవాడ, భీమిలి జోన్ లలో నెలకొన్న నీటి కొరత తీరడానికి తాటిపూడి జలాలు అత్యావశ్యకమని తెలియజేశారు. విశాఖకు గోదావరి నీరు చేరినా తాగు నీటి సరఫరా మెరుగుపడక పోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మధురవాడ అవసరాల కోసం రూ.550 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు పూర్తయితే గోదావరి నీరు అందుబాటులోకి వచ్చి.. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం వస్తుందని అధికారులు వివరించారు. వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోవడం కూడా సమస్య తీవ్రత పెంచిందని తెలిపారు. అలాగే 4 వ వార్డులో మంచినీటి ఎద్దడి నివారణకు రూ.4 కోట్లతో సిద్ధం చేసిన ప్రాజెక్టు డిజైన్లు చూపించారు. వాటర్ సప్లై ఎస్.ఇ. పల్లంరాజు, ఈఈ సుధాకర్, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.




# అరకులో భారీగా వీడిన కూటమి పక్షాలు

### వైసీపీలోకి వలసల జోరు!

**అరకులోయ: సెప్టెంబర్ 10 జయ జయహే.**

కూటమి ప్రభుత్వ పాలనపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత నేపథ్యంలో, అరకు నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలు, పాలనా తీరు పట్ల విసుగు చెందిన వివిధ మండలాల నేతలు వైసీపీ బాట పట్టారు. గురువారం అరకు వ్యాలీ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సమక్షంలో కూటమి పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వైసీపీ కండువా కప్పుకున్నారు.

**మండలాల వారీగా చేరికల నాయకుల వివరాలు:**

పెదబయలు మండలం: కిల్లో రామన్న ఆధ్వర్యంలో 50 మంది,హుకుంపేట మండలం: 30 మంది, అనంతగిరి మండలం: 20 మంది,ముంచంగిపుట్టు మండలం: 20 మంది,మొత్తం వివిధ మండలాల నుండి 120 మంది నాయకులు చేరారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ.. వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ సాదర స్వాగతం పలికారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వీరందరి సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అరకు ఎంపీ గుమ్మ తనూజ రాణి, ఎమ్మెల్సీ కుంభ రవి బాబు, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు పార్లమెంట్ ఒ అసెంబ్లీ ఇంచార్జీలు శ్రీనివాస్, వెంకటరమణ, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు రేగం చాణక్య తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు పెద్ద సంఖ్యలో వైసీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

## భూమన వ్యాఖ్యలపై భగ్గుమన్న

# మంత్రి మండిపల్లి

**తిరుపతి, సెప్టెంబర్ 10, జయ జయహే**




వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఫైర్ అయ్యారు. కరుణాకర్ రెడ్డి కి నిజంగా తిరుమలపై భక్తి ఉంటే రాజకీయ విమర్శలకు భగవంతుడి పేరుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని పిలుపునిచ్చారు. వర్షాలు ఎప్పుడు పడాలి, నదుల్లో నీరు ఎప్పుడు ప్రవహించాలి... అనేది ప్రభుత్వాల చేతిలో ఉండదు.. కానీ వచ్చిన నీటిని సద్వినియోగం చేసుకోవడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. భగవంతుడి దయతో కూటమి ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తూ రాయలసీమకు జలాలు అందిస్తోందని, రాయలసీమకు సాగు, తాగునీరు అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేసిన నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడని కొనియాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పెండింగ్‌లో పెట్టిన ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం మళ్లీ కదలిక తీసుకొచ్చి, వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమకు నీరు అందిస్తు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, కృష్ణా--గోదావరి--పెన్నా అనుసంధానం, హంద్రీ--నీవా వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు ముందుకు సాగుతున్నామని వివరించారు. నీటి సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని, వైసీపీ హయాంలో నిలిచిపోయిన ప్రాజెక్టులే అందుకు నిదర్శనంగా స్పష్టం చేశారు.



# టెక్కలి జిల్లా ఆస్పత్రి కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసనలు

### ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్

**టెక్కలి సెప్టెంబర్ 10 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు నల్ల రిబ్బన్లతో ఆస్పత్రి వద్ద సమాన పనికి ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తమ నిరసనలు వ్యక్తం చేశారు సమగ్ర వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమాన వేతనాలు చెల్లించి తమను రెగ్యులైజ్ చేయాలని నిరసనలో నినాదాలు చేశారు . మా న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి ఒప్పంద ఉద్యోగులైన స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.




## నిడదవోలు పురపాలక సంఘం 32 వార్డుల డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు పురపాలక సంఘ పరిధిలోని మొత్తం 32 వార్డులకు సంబంధించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాను అధికారులు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్, విజయవాడ వారి సూచనల మేరకు ఈ జాబితాను సిద్ధం చేసి ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచారు.వార్డు వారీగా రూపొందించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాను సెప్టెంబర్ 10న నిడదవోలు మున్సిపల్ కార్యాలయం నోటీసు బోర్డుతో పాటు ఆర్డీవో, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, వార్డు సచివాలయాలు తదితర కార్యాలయాల్లో ప్రచురించారు. జాబితాపై ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు, సూచనలు లేదా సలహాలు ఉంటే సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా అందజేయాలని అధికారులు సూచించారు. ప్రజలు డ్రాఫ్ట్ జాబితాను పరిశీలించి తమ అభిప్రాయాలను నిర్ణీత గడువులోగా తెలియజేయాలని కోరారు.

# మానవత్వం చాటిన నృత్య కళాకారులు

### ప్రమాదంలో గాయపడిన డాన్సర్ విజయ్‌కు అండగా డాన్స్ కళాకారులు

**రాజమహేంద్రవరం :జయ జయహే: సెప్టెంబర్ 11**

కళాకారులకు కష్టం వస్తే కళాకారులే అండగా నిలుస్తారనే విషయాన్ని , ధవళేశ్వరం ప్రాంతాల నృత్య కళాకారులు మరోసారి నిరూపించారు. రాజమహేంద్రవరం మంగళవారంపేటకు చెందిన యువ డాన్సర్ విజయ్ ఇటీవల ధవళేశ్వరం వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తలకు బలమైన దెబ్బ తగిలింది. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మెదడుకు శస్త్రచికిత్సతో పాటు అత్యవసర వైద్యం అవసరమని వైద్యులు సూచించారు. చికిత్సకు భారీ మొత్తంలో ఖర్చు అవసరమవడంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన విజయ్‌కు చేయూతనందించేందుకు కళాకారులు ముందుకొచ్చారు.రిథమ్ ఆఫ్ ఆంధ్ర యూనియన్ అధ్యక్షుడు చింతపల్లి సతీష్ ఆధ్వర్యంలో, జోషి డాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు జోషి మాస్టర్ సహకారంతో ధవళేశ్వరం బ్యారేజ్ సెంటర్‌లో ప్రత్యేక డాన్స్ రోడ్ షో నిర్వహించి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జోషి మాస్టర్, యాంకర్ మధు, నారాయణ, మారి, రాజా, విజయ్, మురళి, తదితర డాన్సర్లతో పాటు రాజమహేంద్రవరం, కాకినాడ, తూర్పుగోదావరి






జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వందలాది నృత్య కళాకారులు పాల్గొని విజయ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రోడ్డుపై నిర్వహించిన ఉత్సాహభరితమైన నృత్య ప్రదర్శనలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని వీక్షించిన పలువురు స్వచ్ఛందంగా విరాళాలు అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. కళాకారుల సేవాభావానికి స్థానిక ప్రజలు ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో అత్యంత హృదయాన్ని కదిలించిన సంఘటన చిన్నారుల మానవత్వం. ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులను ఖర్చు చేయకుండా దాచుకుని, ఆ మొత్తాన్ని విజయ్ చికిత్స కోసం విరాళంగా అందించారు. చిన్న వయసులోనే వారు చూపిన సేవాభావం, దాతృత్వం అక్కడున్న ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేసింది. వారి విరాళం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అందరి ప్రశంసలను అందుకుంది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, "విజయ్ పూర్తిగా కోలుకుని మళ్లీ నృత్య వేదికపై అడుగుపెట్టే రోజు కోసం అందరం ఎదురుచూస్తున్నాం. ప్రతి ఒక్కరి చిన్న సహాయం కూడా ఒక ప్రాణాన్ని కాపాడగలదు. దాతలు ముందుకు వచ్చి విజయ్‌కు అండగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాం" అని విజ్ఞప్తి చేశారు.కష్టకాలంలో కళాకారుల ఐక్యత, ప్రజల సహృదయం, చిన్నారుల దాతృత్వం కలిసి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఈ కార్యక్రమం, కళకు మించినది మనిషి ప్రాణమనే గొప్ప సందేశాన్ని సమాజానికి చాటిచెప్పింది.




### అమెరికా వీసా సంక్షోభం..

# భారత్‌కు ఒక అవకాశం

(హెచ్.ప్రతాప్)

అమెరికా విశ్వవిద్యాలయం తలుపులు మూసుకుంటే భారత యువత కలలు కూడా మూసుకుపోవాలా? ఈ ప్రశ్న ఇప్పుడు వేలాది భారతీయ కుటుంబాల ఆందోళనగా మారుతోంది. అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసా వ్యవస్థపై 1,03,265 డాలర్ల అదనపు రుసుమును ప్రతిపాదించడం సహా విదేశీ నిపుణుల నియామకంపై నిబంధనలను కఠినతరం చేసే చర్యలు చేపడుతోంది. ఇది ఇంకా తుది నిబంధన కాదు. అయినప్పటికీ, చదువు పూర్తయిన తర్వాత అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే భారతీయ విద్యార్థుల భవిష్యత్తుపై అనిశ్చితి పెరగడం సహజం.

అమెరికా విద్యపై భారతీయుల ఆధారపడటం చిన్న విషయం కాదు. విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం, 2025 జనవరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 18.82 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారు. వారిలో 12.54 లక్షల మంది విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో ఉన్నారు. అమెరికాలోనే 2.55 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు సూచిస్తున్నాయి.

అయితే మరో తాజా గణాంకం కొత్త పరిస్థితిని సూచిస్తోంది. 2023లో 8.95 లక్షల మంది భారతీయులు చదువు కోసం విదేశాలకు వెళ్లగా, ఆ సంఖ్య 2024లో 7.60 లక్షలకు, 2025లో 6.19 లక్షలకు పడిపోయింది. అంటే విదేశీ విద్యపై ఆకాంక్ష అంతరించిపోలేదు; మారుతున్న వీసా విధానాలు, ఖర్చులు, ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి విద్యార్థుల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి.

అమెరికా విషయంలో అసలు ఆందోళన ఇక్కడే ఉంది. అనేక మంది విద్యార్థులకు విదేశీ విద్య అంటే కేవలం డిగ్రీ కాదు. చదువు → ప్రాక్టికల్ శిక్షణ → ఉద్యోగం → హెచ్-1బీ అనే మార్గమే వారి ఆర్థిక ప్రణాళిక. ఈ మార్గంలో చివరి దశ ఖరీదైనదిగా లేదా అనిశ్చితంగా మారితే, విద్యార్థులు తీసుకున్న భారీ విద్యా రుణాలు, కుటుంబాల పెట్టుబడులు, సంవత్సరాల శ్రమపై ప్రశ్నలు తలెత్తుతాయి.

భారతదేశం దీనిని కేవలం అమెరికా విధానంగా చూసి ఆందోళన చెందకూడదు. ఇది మనకు ఒక ప్రశ్న వేయాలి: ప్రపంచ స్థాయి విద్య కోసం మన విద్యార్థులు ఎందుకు ఇంత దూరం వెళ్లాల్సి వస్తోంది?

సమాధానం విశ్వవిద్యాలయాల సంఖ్య పెంచడంలో లేదు; నాణ్యత పెంచడంలో ఉంది. భారతీయ విశ్వవిద్యాలయాల్లో ప్రపంచస్థాయి ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలు, పరిశ్రమలతో అనుసంధానమైన ప్రాజెక్టులు, కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి రావాలి.

ప్రతి విద్యార్థి డిగ్రీ పూర్తయ్యే వరకు ఉద్యోగం కోసం వేచి ఉండే పరిస్థితి మారాలి. ఇంటర్న్‌షిప్ చదువులో భాగం కావాలి; పరిశ్రమ ప్రాజెక్టు తప్పనిసరి కావాలి; పరిశోధనకు క్రెడిట్ ఇవ్వాలి. విశ్వవిద్యాలయాలు--పరిశ్రమలు కలిసి పాఠ్యప్రణాళికలను రూపొందించాలి. విదేశీ విశ్వవిద్యాలయాలతో సంయుక్త పరిశోధనలు, డిగ్రీలు, అధ్యాపక మార్పిడి కార్యక్రమాలు విస్తరించాలి.

అంతకంటే ముఖ్యంగా, చదువుకున్న యువతకు దేశంలోనే నాణ్యమైన ఉద్యోగాలు రావాలి. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఏఐ, వైద్య పరికరాలు, అంతరిక్షం, రక్షణ సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, బయోటెక్నాలజీ, సైబర్ భద్రత వంటి రంగాల్లో పెట్టుబడులను వేగవంతం చేయాలి. బెంగళూరు, హైదరాబాద్, పుణే వంటి నగరాలతో పాటు రెండో, మూడో శ్రేణి నగరాల్లోనూ పరిశోధన--పరిశ్రమ కేంద్రాలు ఏర్పడాలి.

యువత అమెరికాకు వెళ్లకూడదనేది లక్ష్యం కాదు; వెళ్లాలా వద్దా అనే నిర్ణయం వారి స్వేచ్ఛగా ఉండాలి. అమెరికా నిబంధనలు మారినందుకు భారత విద్యార్థి కలలు ఆగిపోకూడదు. అదే సమయంలో భారతదేశంలోనే ప్రపంచ స్థాయి విద్య, పరిశోధన, వేతనాలు, ఉద్యోగ అవకాశాలు లభిస్తే విదేశీ అవకాశాలు ఒకే మార్గంగా మిగలవు.

అమెరికా తన వీసా విధానాలను ఎప్పుడైనా మార్చుకోవచ్చు. కానీ భారత యువత భవిష్యత్తు మాత్రం ఇతర దేశాల విధానాలపై ఆధారపడకూడదు.

ప్రపంచాన్ని జయించే సామర్థ్యం మన యువతలో ఉంది. ఇప్పుడు ఆ సామర్థ్యానికి ప్రపంచ స్థాయి వేదికను భారత్‌లోనే నిర్మించాల్సిన సమయం వచ్చింది.



### మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం।

**విజయనగరం జిల్లా అడ్మిన్ ఎస్పీ పి.సౌమ్యలత**

విజయనగరం (జయ జయహే)

వినాయక చవితి పండుగ వేడుకల్లో వినాయకుని మట్టి విగ్రహాలకు పూజలు నిర్వహించి, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని విజయనగరం జిల్లా అడ్మిన్ ఎస్పీ పి.సౌమ్యలత పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విజయదుర్గ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన వాల్ పోస్టర్స్, వీడియోను అడ్మిన్ ఎస్పీ శ పి.సౌమ్యలత జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. అడ్మిన్ ఎస్పీ పి.సౌమ్యలత మాట్లాడుతూ - పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇందుకుగాను వినాయక చవితి పండుగ వేడుకల్లో పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించే ప్లాస్టర్ పారిస్, నీరును కలుషితం చేసే రంగు వినాయకుని ప్రతిమలకు బదులుగా మట్టి బొమ్మలని వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనిక రంగులు కారణంగా చెరువులు, నదులు కలుషితం అయి, పక్షులు, చేపలు, ఇతర జంతువులు ప్రమాదంబారిన పడుతున్నాయన్నారు. కావున, ప్రజలు ప్రకృతిని నాశనం చేసే రసాయనిక రంగుల వినాయక ప్రతిమలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించి, భక్తి, శ్రద్ధలతో వినాయక చవితి జరుపుకోవాలని, గణేష్ మహారాజ్ ఆశీస్సులు, అనుగ్రహం పొందాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాల వినియోగం పట్ల, పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో చైతన్యం నింపుతున్న విజయదుర్గ యూత్ సొసైటీ అధ్యక్షులు కేశవపట్నం చంద్రికను అడ్మిన్ ఎస్పీ పి.సౌమ్యలత అభినందించారు.

# జనగణన.. భవిష్యత్ భారతానికి దిక్సూచి

(ప్రతాప్)




దేశాన్ని పాలించడానికి రాజకీయ సంకల్పం ఎంత అవసరమో.. సరైన గణాంకాలు అంతే అవసరం. ఎక్కడ ఎంతమంది ప్రజలు నివసిస్తున్నారు? వారి వయసు, విద్య, ఉపాధి పరిస్థితి ఏమిటి? ఎన్ని కుటుంబాలకు పక్కా ఇళ్లు ఉన్నాయి? ఎంతమంది పట్టణాలకు వలస వెళ్తున్నారు? ఏ ప్రాంతంలో పిల్లలు ఎక్కువగా ఉన్నారు? ఎక్కడ వృద్ధుల సంఖ్య పెరుగుతోంది? వంటి ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు లేకుండా ప్రజా విధానాలను సమర్థంగా రూపొందించడం కష్టం. అందుకే జనగణన అనేది కేవలం జనాభాను లెక్కించే ప్రక్రియ కాదు.. దేశం తనను తాను అర్థం చేసుకునే అతి పెద్ద సమాచార సాధనం.

భారత్‌లో చివరి సంపూర్ణ జనగణన 2011లో జరిగింది. అప్పటికి దేశ జనాభా 121.09 కోట్లు. అక్షరాస్యత 74.04 శాతం. పట్టణ జనాభా సుమారు 31.16 శాతం. దశాబ్దం తర్వాత, 2021లో జరగాల్సిన జనగణన కొవిడ్ కారణంగా వాయిదా పడింది. దీంతో దాదాపు 15 ఏళ్లుగా దేశానికి సమగ్ర జనాభా సమాచారం లేకుండా పోయింది. ప్రస్తుతం అధికారిక జనగణన వనరుల్లో కూడా 2011 గణాంకాలే గ్రామం, పట్టణం, జిల్లా స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రధాన సంపూర్ణ జనాభా డేటాగా ఉన్నాయి.

ఈ డేటా అంతరం చిన్న విషయం కాదు. గత 15 ఏళ్లలో భారతదేశ జనాభా నిర్మాణం, పట్టణీకరణ, వలసలు, కుటుంబ పరిమాణం, విద్య, ఉపాధి, సాంకేతిక వినియోగం వంటి అంశాల్లో భారీ మార్పులు వచ్చాయి. సంతానోత్పత్తి రేటు కూడా గణనీయంగా తగ్గింది. యూఎన్ఎఫ్‌పీఏ ప్రకారం భారత్‌లో ఒక మహిళకు సగటు సంతానోత్పత్తి రేటు 1970లో దాదాపు ఐదు మంది పిల్లల నుంచి ప్రస్తుతం సుమారు ఇద్దరికి పడిపోయింది. అంటే ఒకప్పుడు ప్రధాన సమస్యగా ఉన్న అధిక జనాభా వృద్ధితో పాటు, ఇప్పుడు జనాభా వృద్ధాప్యం, రాష్ట్రాల మధ్య జనాభా మార్పులు వంటి కొత్త సవాళ్లు కూడా ముందుకొస్తున్నాయి.

ఈ నేపథ్యంలో 2027 జనగణన ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది స్వతంత్ర భారతదేశంలో 16వ జనగణన, 2011 తర్వాత తొలి సంపూర్ణ జనగణన. అంతేకాదు, భారతదేశంలో తొలిసారిగా జనాభా లెక్కల సేకరణ పూర్తిగా డిజిటల్ విధానంలో జరగనుంది. గణకులు మొబైల్ పరికరాల ద్వారా వివరాలను నమోదు చేయడంతో పాటు, ప్రజలకు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' అవకాశం కూడా కల్పిస్తున్నారు.

డిజిటల్ విధానం వేగం, డేటా నిర్వహణలో సౌలభ్యం పెంచగలదు. కానీ సాంకేతికత కంటే డేటా నాణ్యతే ముఖ్యం. తప్పు సమాచారం నమోదైతే అత్యాధునిక వ్యవస్థ కూడా తప్పు ఫలితాన్నే ఇస్తుంది. అందుకే గణకులకు శిక్షణ, పర్యవేక్షణ, సమాచార గోప్యత, డేటా భద్రత అత్యంత కీలకం. 2011 జనగణనలో దేశవ్యాప్తంగా సేకరించిన సమాచారంలో జనాభాతో పాటు కుటుంబాలు, లింగం, వయసు, విద్య, ఉపాధి, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు వంటి 85కు పైగా సూచికలను గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు అందుబాటులోకి తెచ్చారు. 2027 జనగణన ఈ సమాచారాన్ని మరింత విస్తృతంగా, తాజా రూపంలో అందించాల్సి ఉంది.

ఈసారి కుల గణన కూడా ప్రత్యేక ప్రాధాన్యం పొందుతోంది. అన్ని కులాల సామాజిక నిర్మాణం, విద్య, ఉపాధి, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచారం లభిస్తే సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయ విధానాలను మరింత లక్ష్యబద్ధంగా రూపొందించేందుకు అవకాశం ఉంటుంది. అయితే కుల డేటా విషయంలో వర్గీకరణలో ఏకరూపత, ప్రజలు ఇచ్చే సమాచారం విశ్వసనీయత, గోప్యత అత్యంత కీలకం. గణాంకం రాజకీయ వాదనకు ఆయుధంగా కాకుండా విధాన నిర్ణయాలకు ఆధారంగా మారాలి.

జనగణన ఫలితాలు విద్యా రంగానికీ కీలకం. ఏ జిల్లాలో పాఠశాల వయసు పిల్లలు ఎక్కువగా ఉన్నారు? ఎక్కడ ఉన్నత విద్య అవసరం పెరుగుతోంది? ఏ ప్రాంతాల్లో నైపుణ్య శిక్షణ అవసరం? ఉపాధి రంగంలో మహిళల భాగస్వామ్యం ఎంత? ఎక్కడి నుంచి ఎక్కడికి కార్మికులు వలస వెళ్తున్నారు? వంటి ప్రశ్నలకు సమాధానాలు లభిస్తే కేంద్రం, రాష్ట్రాలు తమ వనరులను మరింత సమర్థంగా కేటాయించగలవు.

అదే విధంగా ఆరోగ్య రంగంలో పిల్లలు, ప్రసూతి వయసు మహిళలు, వృద్ధుల సంఖ్య ఆధారంగా ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, వైద్య సిబ్బంది అవసరాలను అంచనా వేయవచ్చు. పట్టణ జనాభా పెరుగుతున్న ప్రాంతాల్లో గృహాలు, ప్రజా రవాణా, తాగునీరు, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక అవసరం. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న ప్రాంతాల్లో వృద్ధాప్య సంరక్షణ, సామాజిక భద్రతకు కొత్త విధానాలు అవసరం. ఒకే జనగణన డేటా.. అనేక రంగాల భవిష్యత్ ప్రణాళికకు పునాదిగా మారుతుంది.

అయితే అసలు పరీక్ష డేటా సేకరణతో ముగియదు. జనగణనలో కోట్లాది మంది ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వాలు ఎలా ఉపయోగిస్తాయన్నదే అసలు ప్రశ్న. గణాంకాలు పుస్తకాలలో, వెబ్‌సైట్లలో, నివేదికల్లో మాత్రమే మిగిలిపోతే జనగణన కోసం ఖర్చు చేసిన సమయం, ప్రజల సహకారం రెండూ వృథా. ఆ డేటా ఆధారంగా ఎక్కడ పాఠశాల కావాలి, ఎక్కడ ఆసుపత్రి కావాలి, ఎక్కడ ఉద్యోగ శిక్షణ కేంద్రం కావాలి, ఏ వర్గానికి ఏ విధమైన సహాయం అవసరం, ఏ ప్రాంతానికి ఎంత మౌలిక వసతులు కావాలి అనే నిర్ణయాలు తీసుకున్నప్పుడే దాని విలువ తెలుస్తుంది.

అందుకే 2027 జనగణనను మరోసారి జనాభాను లెక్కించే కార్యక్రమంగా చూడకూడదు. ఇది మారిపోయిన భారతదేశాన్ని అర్థం చేసుకునే చారిత్రక అవకాశం. ఎవరున్నారు, ఎంతమంది ఉన్నారు అన్నది మాత్రమే కాదు.. వారు ఎలా జీవిస్తున్నారు, వారికి ఏమి అవసరం, రేపటి భారతదేశానికి ఎలాంటి వనరులు కావాలి అన్నది తెలుసుకోవాలి. సరైన డేటా లేకుండా సరైన విధానం ఉండదు; సరైన విధానం లేకుండా సమ్మిళిత అభివృద్ధి సాధ్యం కాదు. కాబట్టి 2027 జనగణనలో సేకరించే ప్రతి సమాచారం ఒక సంఖ్య కాదు---ఒక పౌరుడి జీవితం, ఒక కుటుంబం భవిష్యత్తు, ఒక ప్రాంతం అవసరం, చివరికి భారతదేశం రేపటి దిశ. ఆ డేటాను నిజాయితీగా సేకరించి, శాస్త్రీయంగా విశ్లేషించి, ప్రజల జీవితాలను మెరుగుపరిచే నిర్ణయాల్లో ఉపయోగించగలిగితేనే జనగణన తన అసలు అర్థాన్ని సంతరించుకుంటుంది.

# కంద మొక్కపూజ సంతాన ప్రాప్తి

## శ్రావణ అమావాస్య - పోలాల అమావాస్య వ్రత కథా...ప్రత్యేక శీర్షిక

**తెలుగువారి సంప్రదాయ సనాత పండుగలలో నోములలో పోలాల అమావాస్య అతి పురాతన సాంప్రదాయమైన ఆచార వ్యవహారంతో కూడిన కథ. ముఖ్యంగా తల్లులు బిడ్డలు కోసం చేసే అతి పవిత్రమైన పండుగ.**



పోలాల అమావాస్య నోము సంతానం కోసం ఎంతో నియమ నిష్ఠలతో ధార్మికతతో చేసే విశిష్ట భారతీయ సనాతన పురాతన పండుగ.

**పోలేరమ్మ కథ**

ఒక ఊరిలో పోలేరమ్మ అనే శక్తి ఉండేది.పొలాలను కాపాడుతూ బిడ్డలకు ఎటువంటి అనారోగ్యాలు లేకుండా కాపాడే తల్లి. కాలక్రమంలో ఆ ఊరిలో పంటలు పండక ఎంతో సుభిక్షంగా ఉండే ఊరు కాస్త తీవ్రమైన ఇబ్బందులకు లోనయ్యింది. తిండి లేక ఆహారం లభించక ఎంతోమంది మరణించేవారు. ఆ ఊరిలో ఒక తల్లికి ఏడుగురు కొడుకులు ఏడుగురు కోడళ్ళు ఉండేవారు. పోలాల అమావాస్య రోజున ఉపవాసంతో ఉన్న తల్లి వద్దకు వచ్చి చిన్న కుమారుడు ఆకలి వేస్తుంది ఏమైనా ఆహారం కావాలి అంటే ఆ తల్లి పెట్టక కోపంతో కొట్టగా ఆ కుమారుడు అక్కడకు అక్కడే మరణించాడు. పోలేరమ్మకు గ్రామ దేవత వేరే మారువేషములో ప్రత్యక్షమై నీ బిడ్డడు ఏడి అని అడిగితే పొలం కి వెళ్ళాడు అని తల్లి అబద్ధం చెప్పింది పోలేరమ్మ తన యొక్క శక్తితో మరణించాడు అని తెలుసుకుని తల్లి అబద్ధం చెప్పింది అనే ఆగ్రహంతో మిగతా ఆరుగురు పుత్రుని కూడా మరణించే విధం గా చేసింది. దీనితో తల్లి తీవ్రమైన మనస్థాపంతో ఎలాగైనా నా బిడ్డలు కావాలి అని భక్తితో వినయ పూర్వకంగా విధేయతతో పోలేరమ్మను ప్రార్థించడం మొదలుపెట్టింది. తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో కాల కృత్యములు తీర్చుకొని కంద మొక్కను తెచ్చి పూజిస్తూ కంద ఎటువంటి విధంగా కండ పట్టి ఉంటుందో కండకట్టిన పిల్లలను సంతానాన్ని నాకు కలుగజేయి అని తొమ్మిది రకాల కూరగాయలతో పిండి వంటలతో నిష్ఠ గా పూజించడం మొదలు పెట్టింది. అప్పుడు పోలేరమ్మ తన యొక్క భక్తి శ్రద్ధలకు మెచ్చి తిరిగి సంతానాన్ని ప్రసాదించింది. అప్పటినుంచి సనాతన విధి విధానాలతో,ధర్మంగా ఎవరైతే పోలేరమ్మను పూజిస్తారో వారికి సంతానం లభిస్తుంది అని కథా ఫలితం. అలాగే సంతానం ఉన్న తల్లు లు వారి యొక్క సంతానం వృద్ధి లోకి రావాలి అంటే ఎంతో నియమ నిష్ఠలతో పోలేరమ్మ ను అతి పవిత్రము గా పూజించడం మొదలు పెట్టేరు.ఆడపిల్లలు ఉన్న తల్లులు గారెలను పుత్ర సంతానం ఉన్నవాళ్లు బూరెలను అమ్మవారికి నివేదన చేసి,కంద మొక్క రూపం లో అమ్మవారిని పూజిస్తే ఉత్తమ ఫలితము ప్రాప్తము అవుతుంది అని ప్రజల విశ్వాసము.ఈ విధముగా ప్రతీ ఏటా శ్రావణ అమావాస్య రోజు నా ఈ వ్రతం ఆచరిస్తారో వారి సంతానం సకల సంతోషాలతో వర్ధిల్లుతుంది అని భావన.

గ్రామాలలో ఉండే రైతులు నిరంతరం పంటలు సుభిక్షంగా పండాలి అంటే పోలేరమ్మను తప్పక కొలవాలి. అధిక దిగుబడి వ్యవసాయం సుభిక్షం గా ఉండాలి అంటే గ్రామ దేవత పోలేరమ్మ ను కొలవాలి అని,పొలాల దేవత పోలేరమ్మ అని ప్రజల నమ్మకం.

**రచన...
ఏ. బాల సౌజన్యకుమారి,
తెలుగు ఆచార్యులు,
నంది అవార్డు గ్రహీత,
విద్యావేత్త,
ప్రవచనాకర్త,
ఆధ్యాత్మికవేత్త**



# చెట్లను నరికేస్తున్న జివిఎంసి ఇదేం పద్ధతి





## ఇప్పటికే కాలుష్యపు కోరల్లో చిక్కుకున్న విశాఖ రక్షణ ఇదేనా

## ఏళ్ల నాటి చెట్లు తొలగించి సీడ్ బాల్స్‌తో ప్రయోజనం ఏంటి

## జివిఎంసి తీరుపై అగ్రహిస్తున్న స్థానికులు

**విశాఖపట్నం**

కాలుష్యపు కోరల్లో చిక్కుకున్న విశాఖ పర్యావరణ అభివృద్ధికి కృషి చేయాల్సిన యంత్రాంగం పరిరక్షించగా పోగా పచ్చదనం మరింత తగ్గించే చర్యలకు పాల్పడుతుంది . పరిశ్రమలు , డేటా సెంటర్ల కోసం పచ్చనైన కొండలను తవ్వేస్తున్నారు , అడవులు నరికేస్తున్నారు మరోవైపు తాజాగా ఇసుకతోట నుండి మద్దిలపాలెం వైపు వెళ్ళే జాతీయ రహదారి పక్కన ఎన్నో ఏళ్లుగా ఉన్న చెట్లను నరికేస్తున్నారు. ఇదేనా పర్యావరణ పరిరక్షణ అంటూ జివిఎంసి అధికారులు పై ఆగ్రహిస్తున్నారు స్థానికులు. నగరంలో వాహనాల రాకపోకలతో తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతుంది . తాజాగా కాలుష్య నియంత్రణ శాఖ వారు విడుదల చేసిన నివేదికలో వాయు నాణ్యత సూచికలో 200 దాటి నమోదైంది. దేశంలో కాలుష్యంలో మొదటి స్థానంలో నిలిచిన ఢిల్లీ , హైదరాబాద్ కన్నా ముందు వరుసలో విశాఖ నిలవడం ఆలోచించాల్సిన విషయం . ఇప్పటికే పరిశ్రమలు, వాహనాల విడుదల చేసే కాలుష్యం తో విశాఖ ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు . వాయు కాలుష్యంతో అస్తమా బాధితులు , ఊపిరితిత్తుల సమస్యలు పెరుగుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు . తీవ్ర కాలుష్యం కారణంగా విశాఖ వాసులు పొద్దున్న ఇంటి నుండి బయలుదేరి తమ కార్యాలయాలకు చేరుకునే సమయానికి నల్లటి దుమ్ము బట్టలు , ముఖం పై పేరుకుపోతుంది . నగరానికి చుట్టూ పక్కల కొండలు , అడవులు కాలుష్య ప్రభావాన్ని తగ్గిస్తాయనుకుంటే వాటిని నిర్మాణాల కోసం చదును చేసేస్తున్నారు . రహదారుల ఆనుకుని ఉన్న ఇళ్లలోకి దుమ్ము చొరబడకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు రక్షక కవచంలా అడ్డుకుంటున్నాయి . కానీ జివియంసి సిబ్బంది చర్యలు పచ్చదనం తగ్గి కాలుష్యం మరింత పెరిగి ప్రజలు రోగాల భారిన పడేలా చేస్తున్నాయి అనడంలో సందేహం లేదు . నగరానికి అదనపు సోబగుగా ఉన్న పచ్చదనాన్ని , చెట్లను ఎందుకు ఎవరి ప్రయోజనాల కోసం తొలగిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు . అధికారులు ఆలోచన లేకుండా ఇలా నరికేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు .పచ్చదనాన్ని , మంచి గాలిని అందిస్తూ నగరానికి అందంగా ఉండే పెద్ద వృక్షాలను తొలగించి కోట్లు ఖర్చు పెట్టి సీడ్ బాల్స్ వేస్తే ఏం ప్రయోజనం . ఇప్పుడుమద్దిలపాలెం రహదారి పక్కన తొలగించిన మొక్కల స్థానంలో ఇతర మొక్కలను వేయాలని , నగరంలో చెట్లు తొలగింపు చర్యలు మానుకోవాలని అధికారులను కోరుతున్నారు .



## వజ్రపు అప్పారావు సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ (విఎఎస్) సేవా కార్యక్రమం

**బుచ్చియ్యపేట జయ జయహే**

సీతియ్యపేట గ్రామంలో గురువారం వజ్రపు అప్పారావు సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత వజ్రపు శ్రీను ట్రస్ట్ సేవా కార్యక్రమంలో భాగంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న బొబ్బిలి నాగరాజు (ఆది) కుటుంబాన్ని పరామర్శించి, వారికి నిత్యవసర సరుకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని ట్రస్ట్ అధినేత వజ్రపు శ్రీను చేతుల మీదుగా అందించ్చారు. ప్రజలే దేవుళ్ళు - సమాజమే దేవాలయం అనే నినాదంతో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న వి ఎ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీను సేవలను చూసి గ్రామ ప్రజలు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగడ చిన్నం నాయుడు, కొండపల్లి రమణ, కోసూరి సురేష్, పిల్లా కొండలరావు, అల్లు నాగేశ్వరరావు, బొబ్బిలి శ్రీను, యన్నంసెట్టి తేజ, కొండపల్లి శివ, మజ్జి సంజయ్, దండి సతీష్, వజ్రపు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



## రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమంపై

# ఇంటింటా తెలుగుదేశం

### నాలుగో వార్డు ఇన్‌చార్జ్

### శీలబోయిన వెంకటరమణ..

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం 32వ బూత్‌లో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం, ఇంటింటా తెలుగుదేశం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆదేశాల మేరకు, నిడదవోలు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాలుగో వార్డు ఇన్‌చార్జ్ శీలబోయిన వెంకటరమణ, అబ్దుల్ అజిత్ భాష, ఏ శ్రీనివాస్, ఎస్ కే కరీం,కారంకి నవీన్, పూసల సూర్యచంద్రరావు (బాలు ),బొల్లా శ్రీనివాస్ గౌడ్,కురాకుల రమేష్,ఘనసాల శివశంకర్.



## ప్రజా వినతులు స్వీకరిస్తున్న

# భీమర శెట్టి రామ్

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పల్లి జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం స్థానిక నియోజకవర్గం ప్రజలు మరియు కార్యకర్తలు నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను అనకాపల్లి జనసేన పార్టీ ఇన్చార్జి బీమరశెట్టి రామ్కి అందించడం జరిగింది వారు సమస్యలను విన్న సానుకూలంగా స్పందించి మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గారి దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలను త్వరలోనే పరిష్కారం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు మరి కార్యకర్తలకు ఆయన హామీ ఇవ్వడం జరిగింది ప్రజల సమస్య పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు




## రోటరీ ఐ హాస్పిటల్ నందు

# ఉచిత కంటి ఆపరేషన్లు

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి వర్తక సంఘం రోటరీ ఐ హాస్పిటల్ లో గురువారం డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి 8 మంది కి ఐ ఓ ఎల్ ఆపరేషన్లు చేయడం జరిగింది వీరికి ఉచితంగా మందులు కళ్ళజోడు ఇవ్వడం జరిగింది. రోటరీ హాస్పిటల్ రోటరీ ఐ హాస్పటల్ చైర్మన్ ఉప్పల సన్యా శెట్టి జన్మదిన పురస్కరించుకుని మీరు కుమారు లు హాస్పిటల్ మాజీ చైర్మన్ ఉప్పల రవి రామ్ జోహార్ చేతుల మీదుగా మందులు కళ్ళజోడు రొట్టెలు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో రోటరీ ఐ హాస్పిటల్ చైర్మన్ బుద్ధ రామనాజీ కో చైర్మన్ కే సతీష్ రాజేశ్వరి ప్రసాద్ అధ్యక్షుడు సోమ సుందర్ కార్యదర్శి కుష్వంత్ మల్ల సూరిబాబు హాస్పిటల్ సిబ్బంది రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## కేసులు త్వరితగతిన పరిష్కారానికి

# లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

**అనకాపల్లి జయ జయహే**



ఈనెల 12 తేదీ న జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలతు ఖచ్చిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు పోలీస్ స్టేషన్ నాయి స్థానాల్లో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న రాజీ పడదగ్గ కేసులు స్నేహ పూర్వక వాతావరణంలో శాశ్వత పరిష్కారానికి ఇదొక గొప్ప అవకాశం అని ఆయన పేర్కొన్నారు పరిష్కరించుకోగల ప్రధాన కేసులు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు చిన్నపాటి ఘర్షణలు పరస్పర ఫిర్యాదులు సెక్షన్ 320 ఎతీజూఎ పరిధిలోని వివాదాలు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఈ చలానా లు వాహనాల తనిఖీ కేసులు సరిహద్దుతాగాధాలు ఆస్తి విభజన సమస్యలు ఒప్పందాల ఉల్లంఘనలు చెక్ బౌన్స్ కేసులు భార్యాభర్తల మధ్య విభేదాలు మెయింటినెన్స్ పిటిషన్లు మరియు ఎన్పై యాక్ట్ సెక్షన్ 138 కింద నమోదు కేసులు ఇవన్నీ పరిష్కరించుకోవచ్చని వారు తెలిపారు లోక్ అదాలత్ వలన ప్రయోజనాలు ధనం ఆదా కోర్టు చుట్లు తిరిగే శ్రమ తప్పుతోంది సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు త్వరగా ముగింపు పడుతుంది పరస్పర అంగీకరితో పరిష్కారం లభిస్తుంది కాబట్టి ఎవరికి ఓటమి ఉండదు . శత్రుత్వం తొలగి బంధుత్వాలు సంబంధాలు కొనసాగుతాయి లోక్ అదాలత్ లో ఇచ్చే తీర్పుపై మళ్ళీ అప్పిలు చేసుకునే అవకాశం ఉండదు ఇది సివిల్ కోర్టు డిక్రీ తో సమానం తమ కేసులను పరిష్కరించుకోవాలనుకునే కక్షి దారులు తక్షణమే సమీప పోలీస్ స్టేషన్ కు గాని న్యాయవాదులకు గాని జిల్లా నాయిసేవ అధికార సంస్థ కార్యాలయం గాని సంప్రదించి మీ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా జిల్లా ఎస్పీ తుహిన్స్ సిన్హా సూచించారు వివాద రహిత ప్రశాంతమైన సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వామి కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు



## విద్యుత్ మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం

### వేజ్ రివిజన్, ఈపిఎఫ్ నుంచి జీపీఎఫ్ కు మార్పుపై చర్చ

### పెండింగ్ సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూల హామీ

**అమరావతి, సెప్టెంబర్ 10, జయ జయహే :**

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యమ్. శ్రీరామ్ మూర్తి ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర, డిస్కం, జెన్‌కో నాయకులు గురువారం ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి, విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సవివరంగా చర్చించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను విడుదల చేయించేందుకు మంత్రి తీసుకున్న చొరవకు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల మంత్రి చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను అభినందించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగుల వేజ్ రివిజన్ (వేతన సవరణ), ఈపిఎఫ్ నుంచి జీపీఎఫ్ కు మార్పు తదితర ముఖ్యమైన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు. సంఘం నాయకులు ప్రస్తావించిన అంశాలపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ సానుకూలంగా స్పందిస్తూ, విద్యుత్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర, డిస్కమ్ మరియు జెన్‌కో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో నాయకులు కేతు మధుసూదన్ రెడ్డి, సి.పి.డి.సి.ఎల్ నాయకులు ప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలపై

# అవగాహన కార్యక్రమం

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం వెంకట్ నారాయణ స్ఫూర్తి జూనియర్ కళాశాల విద్యార్థులకు మరియు హైవే రోడ్డు నూకాలమ్మ ఆర్చ్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత మరి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా హెల్మెట్ ధారణ లేకుండా అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం ట్రాఫిక్ సిగ్నల్స్ నిబంధనలను పాటించకుండా గమనించకుండా అతివేగంగా వెళ్లడం అతివేగంగా వాహనాలు నడపడం వలన జరిగే ప్రమాదాలు వంటి అంశాలపై స్థానిక వాహనదారులకు విద్యార్థులకు అవగాహన కల్పించారు రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ట్రాఫిక్ నిబంధన పాటించే సురక్షితంగా ప్రయాణించాలని ఆయన సూచించారు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులు తీవ్రంగా గాయపడినప్పుడు ప్రమాదానికి లోనే అపస్మార్క స్థితిలో ఉన్నప్పుడు అటుగా వెళ్లే ప్రయాణికులు సంఘటన చూసిన వెంటనే వాహనదారులు తక్షణమే స్పందించి సమీప పోలీస్ స్టేషన్ కు ఎమర్జెన్సీ అంబులెన్స్ కు ఫోన్ చేసి వారిని రక్షించే చర్యలు చేపట్టాలని వారి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేయడం జరిగింది మనకెందుకులే అని వదిలివేయకుండా తక్షణ స్పందిస్తే ఒక నిండు ప్రాణం రచించిన వారు అవుతామని ఒక కుటుంబాన్ని నిలబెట్టిన వారు అవుతామని ఆయన పేర్కొన్నారు ఈ మధ్యన చాలా మంది ప్రమాద సంఘటన చూసిన వెంటనే వీడియోలు సెల్ఫీలు తీసి మాధ్యమాల్లో పెడుతున్నారని కానీ వారిని రక్షించే ప్రయత్నం చేయటం లేదని వారు వాపోయారు ఎప్పటికైనా ప్రజలు మార్పు తెచ్చుకుని తోటి వారిని రక్షించే ప్రయత్నం చేయాలని ఆయన కోరడం జరిగింది స్పందించి రక్షించిన వారికి పోలీసుల నుంచి ఎటువంటి భయపడవలసిన అవసరం లేదని వారు తెలియజేశారు అలాగే స్పందించిన వారికి రచించిన వారికి ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుతాయని వారి పేర్కొన్నారు

# అరకులో వైయస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం





### కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డ నేతలు

**అరకులోయ: సెప్టెంబర్10 జయ జయహే.**

అల్లూరి జిల్లా కూటమి ప్రభుత్వ పాలన ప్రారంభమై రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైయస్సార్‌సీపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అరకు నియోజకవర్గాల వైయస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముంచంగిపుట్టు, పెదబయలు, అనంతగిరి, అరకు, డుంబ్రిగూడ, హుకుంపేట మండలాల నుంచి భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాదిగా కార్యకర్తలు ఈ సమావేశానికి తరలివచ్చారు. ఈ సభలో పలువురు ప్రముఖ నాయకులు కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ.. 'తల్లికి వందనం' పథకం పూర్తి స్థాయిలో ప్రజలకు అందలేదని ఆరోపించారు. రూ. 4 వేల పింఛన్ ఇస్తామన్న హామీ నిలబెట్టుకోలేదని, కొత్తవి ఇవ్వకపోగా ఉన్నవారి పెన్షన్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఏడాదికి మూడు సిలిండర్లు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ.. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో గిరిజనులకు 3.30 లక్షల ఎకరాలకు పైగా పోడు పట్టాలు ఇస్తే, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ఒక సెంటు భూమికి కూడా పట్టా ఇవ్వలేదన్నారు. అరకు కాఫీని గిరిజన రైతు వద్ద కేజీ రూ. 320లకు కొనుగోలు చేసి, యూరప్ స్టోర్లలో రూ. 5,200లకు అమ్ముతున్నారని తెలిపారు. పౌర సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఎంపీ గుమ్మ తనుజరాణి మాట్లాడుతూ.. అరకు, పాడేరు ప్రాంతాలు ఎప్పటికీ వైయస్సార్‌సీపీకి కంచుకోటలని స్పష్టం చేశారు. హామీల అమలులో విఫలమైన ప్రభుత్వం.. వైయస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో వేసిన రోడ్లపై కేవలం తారు వేసి, పేర్లు మార్చి కూటమి ప్రభుత్వం 'అడవి తల్లి బాట' గా ప్రచారం చేసుకుంటోందని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ.. అల్లూరి జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని స్పష్టం చేశారు. మాజీ జీసీసీ చైర్మన్ స్వాతిరాణి మాట్లాడుతూ కూటమిలోని మూడు పార్టీల మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయని, కేవలం రాజకీయ మనుగడ కోసమే అన్నీ కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు. ఉమ్మడి విశాఖ జడ్పీ చైర్మన్ సుభద్ర మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యమంత్రే స్వయంగా గ్రామాలకు వచ్చి ఓట్లు అడగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. నాయకులు, కార్యకర్తలు చిన్నచిన్న మనస్పర్థలను విడనాడి పార్టీ విజయమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పార్టీ మద్దతు తెలిపే అభ్యర్థులందరినీ గెలిపించుకోవడమే ప్రధాన లక్ష్యంగా శ్రమించాలని శ్రేణులను కోరారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసిపి క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అసెంబ్లీ ఇంచార్జీలు శ్రీనివాస్, వెంకటరమణ, వైయాస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేగం చాణక్య, మండల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, రాష్ట్ర, జిల్లా, మండల, పంచాయితీ, గ్రామ స్థాయిలో పార్టీ వివిధ హోదాలో ఉన్న పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



## "క్వారీకి నీటి వరం.. నగరానికి అభివృద్ధి జోరు!"

**రాజమహేంద్రవరం: జయ జయహే: సెప్టెంబర్ 11**

నగరంలో తాగునీరు, డ్రైనేజీ, వర్షపు నీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి భారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. తిలక్‌రోడ్డులోని రెడ్డీస్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ప్రస్తుతం 49,237 తాగునీటి కనెక్షన్లు ఉండగా, అమృత్ 2.0 కింద మరో 8,000 కనెక్షన్లుఅందిస్తున్నామన్నారు. గత రెండేళ్లలో గుర్తించిన 3,153 లీకేజీల్లో 3,119కు మరమ్మతులు పూర్తయ్యాయని తెలిపారు. క్వారీ ప్రాంతంలో దశాబ్దాలుగా ఉన్న తాగునీటి సమస్యకు అమృత్ 2.0 ద్వారా సుమారు రూ.100 కోట్లతో కొత్త ఫిల్ట్రేషన్ ప్లాంట్, ఓవర్‌హెడ్ ట్యాంక్, పంపింగ్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు నిర్మిస్తున్నామని చెప్పారు. హైటెక్ బస్టాండ్ పరిధిలో వర్షపు నీటి సమస్యకు రూ.6 కోట్లతో మేజర్ డ్రెయిన్, లోతట్టు ప్రాంతాల రోడ్ల ఎత్తు పెంపునకు మరో రూ.30 లక్షల పనులుచేపడుతున్నామన్నారు. నల్లా ఛానల్ పరిధిలో రూ.2 కోట్లు, కోటగుమ్మం--డీలక్స్ సెంటర్ వరకు రూ.5 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నగరంలో కార్పొరేషన్ ద్వారా సుమారు రూ.350 కోట్ల అభివృద్ధి పనులు, మురుగునీటి వ్యవస్థకు మరో రూ.100 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. మోరంపూడి వద్ద రూ.53 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, కేలో ఇండియా ద్వారా రూ.14 కోట్లతో రివర్ అరేనా అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు టిడిపి --జనసేన--బిజెపి,కూటమి సిద్ధంగా ఉందని, సమన్వయంతో అభ్యర్థుల ఎంపిక చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 769 మందికి రూ.6.43 కోట్ల సాయం అందిందన్నారు. సమావేశంలో టిడిపి , జనసేన, బిజెపి నాయకులు, కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

### విధులు బహిష్కరించిన లాయర్లు

**చోడవరం సెప్టెంబర్ 10 జయ జయహే**

సమాజంలో అన్ని వర్గాలకు రక్షణ చట్టం కల్పిస్తున్న ప్రభుత్వం న్యాయవాద విషయంలో తాత్సర్యం చేస్తుందంటూ న్యాయవాదులు మండిపడుతున్నారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల్లో న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేస్తున్నారని కానీ ఏపీలో మాత్రం ఆ పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ముందు మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని కానీ నేటి వరకు అమలు కాలేదన్నారు. తెలంగాణతో చూసుకుంటే ఏపీ అన్ని విధాల పెద్దరాష్టమని అలాంటి రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువైందని దాడులు చేస్తున్నారని అలాంటి పరిస్థితుల్లో మాకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం దేనిని చెప్పారు. సందర్భంగా చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం ఎల్లారావు ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. రెండు రోజులపాటు విధులు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వం స్పందించకపోతే తమ ఆందోళన ఉధృతం చేస్తామని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని న్యాయవాద స్పష్టం చేశారు.

# తీర ప్రాంత రక్షణ కవచం కోసం తాటి పళ్ళు నాటండి





### తుఫాను గాలులు ఉధృతి తగ్గించడానికి రక్షణ వనాలు

### తాటి పండ్లు నాటేందుకు వచ్చిన హరితసేన

**విశాఖపట్నం (జయ జయహే)**

తీర ప్రాంత రక్షణ కవచం కోసం తాటి పళ్ళు నాటండి అని అటవీ శాఖ పిలుపునందుకుని విశాఖపట్నం జిల్లా భీమిలి లోని గిల్మెన్ ఫీల్డ్ లో గురువారం ఉదయం నిర్వహించిన కార్యక్రమానికి గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం నేతృత్వంలో కేథరిన్ సంస్థకు చెందిన విద్యార్థులు ఆకుపచ్చ టీ షర్టు ధరించిన హరిత సేన కదలి వచ్చింది. 100 మంది హరిత సైనికులు పెద్ద ఎత్తున పాల్గొని తాటి పళ్ళు సముద్ర తీరంలో నాటారు. ప్రధానంగా అటవీ శాఖ నేతృత్వంలో గిల్ మెన్ ఫీల్డ్ లో తాటి పళ్ళు నాటించడం జరిగింది. వాస్తవానికి గిల్మన్ ఫీల్డ్ లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర సలహాదారు పి మల్లికార్జున రావు తాటి పళ్ళు నాటారు. ప్రధానంగా తుఫాను గాలులు ఉధృతి తగ్గించడానికి రక్షణ వనాలు ఉపయోగపడతాయని, ఆంధ్ర కోస్తా తీరమంతా తీర ప్రాంత రక్షణ కవచం కోసం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది ఈ బృహత్తర కార్యక్రమం ఇది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అనందోత్సాహంతో పాల్గొని తాటి పళ్ళు విపరీతంగా నాటడం విశేషం. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ చీఫ్ కంప్యూటర్ ఆఫ్ ఫారెస్ట్ కె వి ఎస్ రాజు, డీఎఫ్ఓ రవీంద్ర ధామ పాల్గొని మాట్లాడారు. అధిక సంఖ్యలో అటవీ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## మాడుగుల మండలంలో పోలింగ్ స్టేషన్ల పరిశీలన

**మాడుగుల సెప్టెంబర్ 10 జయ జయహే**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాడుగుల మండలంలో గల ఎంపిటిసి జడ్పిటిసి పోలింగ్ స్టేషన్లను గురువారం ఎండి ఒకే అప్పారావు సందర్శించి పరిశీలించారు. మొత్తం 29 పంచాయతీల్లో 77 పోలీస్ స్టేషన్లను గుర్తించారు. వాటిలో గల సౌకర్యాలను కూడా పరిశీలించి ఎక్కడైనా సౌకర్యాలు లోపిస్తే అక్కడ తగు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎండివో తెలిపారు.



## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేసిన సబ్ రిజిస్ట్రార్

**చోడవరం సెప్టెంబర్ 10 జయ జయహే**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు వినాయక చవితి పురస్కరించుకొని మట్టి వినాయక విగ్రహాలు పూజించాలని చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి కోరారు. గురువారం ఆమె రిజిస్ట్రేషన్ కి వచ్చిన ప్రతి ఒక్కరికి మట్టి వినాయక విగ్రహాన్ని అందజేసి ఈ విగ్రహాన్ని పూజించాలని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అవగాహన కల్పించారు. ఈమె చోడవరం రిజిస్ట్రార్ గా బాధ్యత చేపట్టిన నాటి నుంచి కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు అనేకం చేస్తున్నారు. గత ఏడాది కూడా మట్టి విగ్రహాలు పంపిణీ చేసి సమాజం పట్ల బాధ్యతను రుజువు చేశారు. ఈ ఏడాది కూడా వందమందికి విగ్రహాలు అందజేశారు. దీంతో పలువురు ఆమెను అభినందించారు.

## చవితి ఉత్సవాల్లో వివిధ వేషధారణ విగ్రహాలు ఏర్పాటు అరిష్టం

### ఈనెల 14 చవితి జరుపుకోవాలి

**మాడుగుల సెప్టెంబర్ 10 జయ జయహే**



ఈ ఏడాది భాద్రపద శుద్ధ చవితి ఈ నెల 14న ఉదయం 7గం10 నిమిషములకు ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 7.40 గంటల వరకు చవితి ఉన్నందున శాస్త్ర ప్రకారం మద్యాహ్నప్రాప్తి చవితి తిది ఉన్నరోజునే వినాయక చవితి నిర్వహించుకోవాలని ప్రముఖ సిద్ధాంతి భమిడిపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరు సోమవారం నాడు వినాయక చవితి జరుపకోనవలనీ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ వాతావరణం పరిస్థితులకు అనుగుణంగా ఈ ఉత్సవల్లో మట్టి వినాయకులను పూజించడం ఎంతో శ్రేయోస్కరమన్నారు. నవరాత్రి ఉత్సవములు జరుపుతున్నవారు తొమ్మిది రాత్రులు జరుపుకొని మరుసటి రోజు అంటే 10వరోజు నిమజ్జనం చేయుట శాస్త్ర సమ్మతమన్నారు. వివిద వేషదారణతో విగ్రహములు తయారుచేసి నవరాత్రి పందిరిలో పూజలుచేయుట చాల అరిష్టమన్నారు. మట్టి వినాయకులను పూజించుటవల్లన పర్యవరణాన్ని కాపాడినవారు అవుతారనీ తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు సకాలములో లేనందున నీరు లబ్యతను దృష్టిలో ఉంచుకొని వినాయక ప్రతిమలను ప్రతిష్టచేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



## చోడవరంలో ఉరుములు పిడుగులతో కూడిన వర్షం

### కాలిపోయిన ఫ్యాన్లు కంప్యూటర్లు దెబ్బతిన్న భవనాలు

**చోడవరం సెప్టెంబర్ 10 జయ జయహే**

చోడవరంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులు పిడుగులతో కూడిన వర్షం కాస్త నష్టానికి గురి చేసింది. వర్షం వల్ల కాస్తా చల్ల దనం వచ్చినప్పటికీ పలుచోట్ల ఫ్యాన్లు,కంప్యూటర్లు కాలిపోగా డిగ్రీ కళాశాల భవనాలు దెబ్బతిన్నాయి. దీంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

# జర్నలిస్ట్లలకు ఆధ్యాత్మిక సశక్తీకరణ

## మీడియా జాతీయ సదస్సులో జర్నలిస్ట్ మేధావుల నినాదం

**మౌంట్ అబూ, సెప్టెంబర్ 10, జయ జయహే**

రాజస్థాన్లోని మౌంట్ అబులోని మానస సరోవర్ వేదికగా సెప్టెంబరు 9 నుంచి 13వ తేదీ వరకు జరుగనున్న జాతీయ మీడియా సదస్సు ఘనంగా ప్రారంభమైంది. గురువారం పరిచయ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జాతీయ సదస్సు చైర్ పర్సన్ పీకే కరుణాభాయ్ మాట్లాడుతూ మన భారతదేశాన్ని విశ్వ గురువుగా ప్రపంచ దేశాలకు రుజువు చేస్తూ పాత్రికేయులు అందరూ తమ విలువలతో కూడిన శ్రేష్ఠ సమాజమును ఆధ్యాత్మిక ససక్తీకరణ ద్వారా నిర్మించాలని సభాముఖంగా సందేశం ఇచ్చారు. కాన్ఫరెన్స్ యొక్క ముఖ్యాంశాలు బికే నికుంజ్ , రాయపూర్ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ మాన్సింగ్, విశిష్ట అతిథిగా భారత్ న్యూస్ చీఫ్ ఎడిటర్ డాక్టర్ సర్ఫరాజ్ సైఫీ, మరో విశిష్ట అతిథిగా జర్నలిజం ప్రొఫెసర్ సంజయ్ దివేది తదితరులు పాల్గొన్నారు. ముందుగా కోఆర్డినేటర్ చంద్రకళ వ్యాఖ్యానిస్తూ అతిథిలను ఆహ్వానించవలసిందిగా వైస్ చైర్ పర్సన్ మీడియా వింగ్ బి కే సరళని కోరారు. తదనంతరం విశిష్ట అతిథులుగా విచ్చేసిన వారు తమ మాటలలో మీడియా రంగంలో పాత్రికేయులకు తమ గౌరవం స్నేహంతో కట్టివేసి మూడు రోజులపాటు విశేషమైన మానసిక పరివర్తన కోసం ఆధ్యాత్మిక సశక్తీకరణ కోసం ఎంతో ప్రయాసతో బ్రహ్మకుమారీస్ సేవలందిస్తున్నారని కొనియాడారు. డాక్టర్ రానా యశ్వంత్ మాట్లాడుతూ ఇప్పుడు మీడియా రంగంలో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగిస్తున్నారని అది రాబోయే ప్రమాదాలకు ఊహించని రీతిలో మలుపు తిరగనున్నదని సభాముఖంగా తెలిపారు. సైఫీ మాట్లాడుతూ తాను ఈ జాతీయ సదస్సుకి మొదటిసారిగా వచ్చానని ఇక్కడ పాత్రికేయులకు ఆధ్యాత్మికత తో కూడిన ససక్తీకరణ తమకు లభిస్తున్నందుకు ఎంతో అభినందించారు. జైపూర్ ఇన్చార్జ్ బీ కే సుష్మ మాట్లాడుతూ పరమాత్ముని అనుభూతిని మరియు సైలెన్స్లు మెడిటేషన్ ద్వారా అనుభూతి చేయించారు. ప్రతి జాతీయ మీడియా సదస్సులో ఎప్పటిలాగే ఆత్మల ప్రతిధ్వనులు అనే అంశంపై నికుంజు రాసిన పుస్తకమును విడుదల చేశారు. ఈ జాతీయ మీడియా సదస్సులో భారతదేశం నలుమూలల నుంచి పలువురు జర్నలిస్టు పాల్గొన్నారు.






### మర్రివాడ పంచాయతీలో

## రాజ్మా విత్తనాల పంపిణీ

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 11,**

కొయ్యూరు మండలం మర్రివాడ పంచాయతీ పరిధిలో ఈ రోజు రాజ్మా విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.మర్రివాడ పంచాయతీ పరిధిలోని లూసం, నిమ్మలగొంది, బలబద్రపాడు, గొల్లివలస గ్రామాల రైతులకు 90% సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేయడం జరిగింది. ఎల్ నినో మరియు గంజాయి సాగు నిర్మూలన క్రింద ఈ విత్తనాలను రైతులకు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.రైతులకు పారదర్శకత కోసం డి-కృషి యాప్ ద్వారా పట్టా ఉన్న రైతులకు మాత్రమే విత్తనాలు ఇవ్వడం జరిగింది.మన మండలానికి మొత్తం 213.8 క్వింటాళ్ల విత్తనాలు రాగా.. అందులో మర్రివాడలో 35 క్వింటాళ్లు, బుదరాళ్లలో 81.80 క్వింటాళ్లు, యు.చీడిపాలెంలో 60 క్వింటాళ్లు, నల్లగొండలో 2 క్వింటాళ్లు, ఎం.భీమవరంలో 35 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది.కావలసిన రైతులు పట్టా జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తో సంబంధిత రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి విత్తనాలు పొందగలరని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగతల్లి గారు, మండల వ్యవసాయ అధికారి పి. శివ రామ ప్రసాద్, వ్యవసాయ ఉద్యాన అధికారి కోటేశ్వరరావు మరియు రైతులు పాల్గొన్నారు.




## 9వ జాతీయ పోషణ మాసోత్సవాల ప్రారంభం

**మునగపాక, సెప్టెంబర్ 10, జయ జయహే:**

మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మా అంగన్‌వాడీ -- మా బాధ్యత అనే ప్రధాన సందేశంతో 9వ జాతీయ పోషణ మాసోత్సవాల కార్యక్రమాలు సెప్టెంబర్ 9వ తేదీ నుండి అక్టోబర్ 8వ తేదీ వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐదు ప్రధాన థీమ్స్‌పై దృష్టి సారిస్తూ, వివిధ లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కమ్యూనిటీ స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆహార వైవిధ్యం మరియు తగినంత ప్రోటీన్, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాజా వేడి వండిన భోజనం, కమ్యూనిటీ భాగస్వామ్యం మరియు జవాబుదారీతనం, పోషణ--ప్రారంభ బాల్య ప్రేరణ--విద్య ద్వారా బాలల అభివృద్ధి, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన 10సంవత్సరాలు అనే ఐదు అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ కె. ఇందిరా దేవి ఆధ్వర్యంలో, ఎంపీడీఓ, ఎమ్ఈఓ, ఎస్ఈఆర్పీ, ఎస్హెచ్జీ ప్రతినిధులు, పీహెచ్సీ సిబ్బంది మరియు వివిధ లైన్ డిపార్ట్‌మెంట్‌ల ప్రతినిధుల సమన్వయంతో 9వ జాతీయ పోషణ మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బుల్లయ్య కళాశాలలో ఘనంగా పోషకాహార వారోత్సవాలు





**విశాఖపట్నం, సెప్టెంబర్ 10: (జయ జయహే)**

డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని లైఫ్ సైన్సెస్ అండ్ కెమిస్ట్రీ (యూజీ, పీజీ) విభాగాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7, 8 తేదీల్లో "డిస్కవర్ ది పవర్ ఆఫ్ న్యూట్రిషన్" అనే ఇతివృత్తంతో పోషకాహార వారోత్సవాలు-2026 నిర్వహించారు.రెండు రోజుల కార్యక్రమాలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. మధు కుమార్ ప్రారంభించి, ఆరోగ్యం, శారీరక--మానసిక శ్రేయస్సులో పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ ఎ. మైతిలి పోషకాహారం--ఆరోగ్యంపై అవగాహనాత్మక ప్రసంగం చేశారు. అనంతరం విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు.రెండో రోజు డాక్టర్ ఎస్. ఎన్. సి. వసుంధర, చీఫ్ డైటీషియన్, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. యూజీ బయోటెక్నాలజీ విద్యార్థులు సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహార ఎంపికల ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన స్కిట్ ప్రదర్శించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ ఎగ్జిబిషన్‌లో పోషక విలువలున్న ఆహార పదార్థాలను ప్రదర్శించి, ఆరోగ్యకరమైన ఆహారంపై తమ అవగాహనను చాటుకున్నారు.ముగింపు కార్యక్రమంలో మూడు విద్యార్థి పోటీల విజేతలను ప్రకటించి అభినందించారు. యూజీ కోర్సుల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేఖ ప్రోత్సాహకరమైన సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సమతుల్య పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత ఆరోగ్యం మరియు సమగ్ర శ్రేయస్సుపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారి సృజనాత్మకతను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ (ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు--యూజీ, పీజీ) డాక్టర్ జి. ఎస్. కె. చక్రవర్తి, పీజీ కోర్సుల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వి. హెచ్. శ్రీకాంత్ కార్యక్రమానికి సహకరించారు.కార్యక్రమానికి పీజీ బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్. షర్మిలా బేగం కన్వీనర్‌గా, యూజీ బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం. భారతి కో-కన్వీనర్‌గా వ్యవహరించారు. డాక్టర్ బి. మాధవి, డాక్టర్ పి. కిరణ్ కుమారి, డాక్టర్ బి. శైలజ, డాక్టర్ కె. గీత, ఎల్. ఉమా తులసి, డాక్టర్ ఎస్. సుభ, ఆర్. స్వప్న, జి. లావణ్య, బి. కావ్య, ఎం. సునీత, కె. అనంతలక్ష్మి, కె.వి.ఎల్. శరణ్య, ఎస్. గాయత్రి, ఎన్. సిరీష తదితరులు నిర్వహణ కమిటీ సభ్యులుగా పాల్గొన్నారు



## వర్షాల కోసం ఊరురా పూజలు కనికరించిన వరుణదేవుడు

**మునగపాక సెప్టెంబర్ 10 జయ జయహే**

మునగపాక మండలంలోని వాడ్రపల్లి మునగపాక మూలపేట తదితర గ్రామాల్లో గురువారం వాన దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు కప్ప కప్ప నీలాలుల నీలాలంటూ అంటూ కప్పలకు స్నానాలు చేయించి వాడ్రాపల్లి ఆవాలు శివాభిషేకం చేశారు శివునికి ప్రత్యేక పూజలు చేశారు శివునికి నైవేద్యం సమర్పించి పరమాన్నం వండించి భక్తులంతా ప్రసాదం స్వీకరించారు శివునికి పూజలు చేసి ఇంటికి వచ్చేసరికి భారీ ఎత్తున వర్షం గురించడంతో ప్రజలు రైతులు అర్థం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెతకం శెట్టి రామజోగి నాయుడు మల్లహన్ సింగ్ రావు మల్ల శేషుబాబు బొడ్డేడు సత్యనారాయణ కాండ్రేగుల నూకరాజు నూక అప్పారావు కోయిలాడ దశావతారం మల్ల రామ జోగినాయుడు గ్రామ పెద్దలు రైతులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## నేడు వీఎంఆర్‌డీఏలో ఓపెన్ ఫోరం

**విశాఖపట్నం (జయ జయహే)**

వీఎంఆర్‌డీఏకు సంబంధించి ఏదైనా సమస్యలపై ప్రజలు అధికారులకు తెలియజేసేందుకు వీలుగా వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కేతన్‌గార్గ్ నేతృత్వంలో ఓపెన్ ఫోరం నిర్వహించటం జరుగుతోంది. ప్రజల సౌకర్యార్థం వీఎంఆర్‌డీఏకు చెందిన అన్ని విభాగాలకు సంబంధించిన సమస్యలను అధికారులకు నేరుగా తెలియజేసే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఈ ఓపెన్ ఫోరం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో 9వ అంతస్తు సమావేశమందిరంలో నిర్వహిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ పరిధిలోని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కేతన్‌గార్గ్ ఒక ప్రకటనలో కోరారు.




## మునగపాకలో ఇంటింటికి వినాయకుడు

**మునగపాక, సెప్టెంబర్ 10, జయ జయహే:**

మునగపాక మండల కేంద్రం మునగపాకలోని తారకరామ కాలనీ, బీసీ కాలనీలో శ్రీధర్మా ఫౌండేషన్ చైర్మన్ మరియు రాష్ట్ర టిడిపి నాయకులు కర్రి సాయికృష్ణ చేతుల మీదుగా ఇంటింటికి వినాయకుడు పేరుతో మట్టి వినాయక ప్రతిమలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా రసాయనాలు వాడకుండా పూర్తిగా మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలను శ్రీధర్మ ఫౌండేషన్ తరపున మునగపాకలో ఇంటింటికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విల్లూరి నూక నరసింహారావు, మునగపాక గ్రామ శాఖ టిడిపి అధ్యక్షులు దాడి శివ, పెంటకోట శ్రీరామమూర్తి, శ్రీధర్మా ఫౌండేషన్ సభ్యులు, టిడిపి నాయకులు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## లైంగిక దాడికి గురైన వృద్ధురాలికి అండగా నిలిచిన పోలీసులు

**విజయనగరం జయజయహే**



విజయనగరం పట్టణంలో ఇటీవల లైంగిక దాడికి గురైన 82 ఏళ్ల మహిళకు ఆర్థికంగా చేదోడుగా నిలిచినట్లు మహిళా పీఎస్ డీఎస్పీ పి.వి.వి.నరసింహారావు తెలిపారు. గురువారం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో మహిళా పోలీసు స్టేషన్ అధికారులు, సిబ్బంది ఆర్థికంగా సహకరించారని తెలిపారు. బాధిత వృద్ధురాలి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వృద్ధురాలి భాదను అర్థం చేసుకొని, అధైర్య పడవద్దని, లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి శిక్షపడే విధంగా చేసి, న్యాయం చేస్తామని ధైర్యాన్ని కల్పించారు. వృద్ధురాలి కుటుంబానికి బట్టలు, కిరాణ వస్తువులు, బియ్యం వగైరా వస్తువులను అందజేశారు. వృద్ధురాలు మరియు వారి కుటుంబ సభ్యుల పట్ల పోలీసులు చూపిన దాతృత్వం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# పర్యావరణ పరిరక్షణకు హరిత వినాయకుడే మార్గం

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**అనకాపల్లి / ఎరుకువానిపాలెం,( జయ జయహే)**




వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఎరుకువానిపాలెంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ , జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య పరిరక్షణ పురస్కార గ్రహీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడిని భక్తితో పూజించడం మన సంప్రదాయం. అదే సమయంలో ఆయనకు ప్రీతిపాత్రమైన ప్రకృతిని కాపాడటం కూడా మన పవిత్రమైన బాధ్యత" అని అన్నారు.

"పండుగ మనకు ఆనందాన్ని ఇవ్వాలి కానీ ప్రకృతికి నష్టాన్ని కలిగించకూడదు. మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా మన సంప్రదాయాన్ని గౌరవించడంతో పాటు జలవనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చు" అని తెలిపారు. విద్యార్థులు తమ ఇళ్లలో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడంతో పాటు, కుటుంబ సభ్యులు మరియు చుట్టుపక్కల ప్రజలకు కూడా పర్యావరణహిత వినాయక చవితి ప్రాముఖ్యతను తెలియజేయాలని పిలుపునిచ్చారు.

"ఒక ఇంట్లో మట్టి వినాయకుడు ప్రతిష్ఠించడం ఒక చిన్న అడుగు కావచ్చు... కానీ అలాంటి లక్షల చిన్న అడుగులే పర్యావరణ పరిరక్షణలో గొప్ప మార్పును తీసుకువస్తాయి" అని ప్రధానోపాధ్యాయులు అన్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అరిగె శ్రీనివాసరావు మాట్లాడుతూ, చిన్న వయసులోనే విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలను పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. నరసింహమూర్తి , బి. వై. వై. ఎస్. కృష్ణారావు , పి. జయశ్రీ , డి. శ్రీలత , ఎస్. సుజాత , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుకు

# రూ.లక్ష లంచం

### తెలంగాణ సచివాలయంలో ఏసీబీ దాడులు..

**జయ జయహే**



తెలంగాణ సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన ట్రాప్ కలకలం రేపింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.2 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెక్కును ఇప్పించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు అందిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. సచివాలయ ఆవరణలోని దేవాలయం సమీపంలో లంచం తీసుకుంటుండగా ఓ ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ లంచం తీసుకోవడంలో మరో ఉద్యోగి హస్తం కూడా ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వారిద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి.. విచారిస్తున్నారు. సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కు కోసం బాధితుడు సంబంధిత ఉద్యోగులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో చెక్కును అందించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించినట్లు సమాచారం. ఇందులో భాగంగా సచివాలయ ఆవరణలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఉద్యోగిని అధికారులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ విభాగానికి సంబంధించిన సెక్షన్ ఆఫీసర్ వినోద్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మొదటి విడతగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్ర రూ.5 వేల నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మిగిలిన మొత్తంలో భాగంగా రూ.లక్ష తీసుకునే సమయంలో సీనియర్ అసిస్టెంట్/సెక్షన్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగి ఏసీబీ ట్రాప్‌లో చిక్కినట్లు తెలుస్తోంది. ఈ లంచం వ్యవహారంలో ఎవరి ఆదేశాల మేరకు డబ్బులు డిమాండ్ చేశారు.. ఇంకా ఎవరైనా ఉద్యోగులు, అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారా.. అనే కోణాల్లో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ట్రాప్ తర్వాత ఏసీబీ అధికారులు సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన విభాగంలో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాధితుడి దరఖాస్తు, సీఎంఆర్ఎఫ్ మంజూరు ప్రక్రియ, చెక్కు విడుదలకు సంబంధించిన ఫైళ్లు, ఉద్యోగుల పాత్రపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్ వెనుక మరెవరైనా రెగ్యులర్ అధికారులు ఉన్నారా అనే అంశంపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ట్రాప్‌లో పట్టుబడిన ఇద్దరు ఉద్యోగులను నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, డబ్బుల లావాదేవీలు, సీఎంఆర్ఎఫ్ ఫైల్ ప్రాసెసింగ్‌లో వారి పాత్ర వంటి అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన కార్యాలయమైన సచివాలయంలోనే సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం తీసుకుంటూ ఉద్యోగులు పట్టుబడినట్లు వార్తలు రావడం ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీసింది. పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన ప్రక్రియలో లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.



# ట్రంప్ డివిడెండ్

### రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి అమెరికన్‌కు 5 వేల డాలర్లు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ

**జయ జయహే**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర చర్చనీయాంశమైన ప్రకటన చేశారు. రాబోయే మధ్యంతర ఎన్నికల్లో తమ రిపబ్లికన్ పార్టీ విజయం సాధించి, కాంగ్రెస్‌లోని ఉభయ సభలపై నియంత్రణ సాధిస్తే.. దేశంలోని ప్రతి వయోజన అమెరికా పౌరుడికి 5,000 డాలర్లు (సుమారు రూ.4.2 లక్షలు) ఇస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ సంక్షేమాన్ని ఆయన "ట్రంప్ డివిడెండ్ గా పేర్కొన్నారు. టెక్సాస్‌లోని డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ మధ్యంతర ఎన్నికల సభలో డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. డెమోక్రాట్‌లతో పోటీలో రిపబ్లికన్ పార్టీ ఓటింగ్ సర్వేల్లో వెనుకబడి ఉన్న నేపథ్యంలో, ఓటర్లను ఆకర్షించేందుకు ట్రంప్ ఈ అసాధారణ హామీ ఇచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సభలో ట్రంప్ మాట్లాడుతూ.. "అమెరికా అద్భుతమైన ఆర్థిక విజయం కారణంగా ఈ హామీ నేను మాత్రమే చేయగలను. నవంబర్ 3న జరగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిస్తే, మీరు మాతో కలిసి గెలుస్తారు. మీకు 5,000 డాలర్లు లభిస్తాయి. నవంబర్ బ్యాలెట్‌లో నేను స్వయంగా పోటీలో ఉన్నట్లే భావించి ఓటు వేయండి" అని మద్దతుదారులను కోరారు. ట్రంప్ డెవిడెండ్ హామీ అమలుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలో దాదాపు 27 కోట్ల మంది వయోజనులు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ 5,000 డాలర్ల చొప్పున పంపిణీ చేయాలంటే ప్రభుత్వానికి సుమారు 1.35 ట్రిలియన్ డాలర్లు ఖర్చవుతుందని విశ్లేషకులు తెలిపారు. అయితే, ఈ భారీ మొత్తం నిధులు ఎక్కడి నుంచి వస్తాయనే దానిపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. "మన దేశం చాలా డబ్బు సంపాదిస్తోంది" అని మాత్రమే ట్రంప్ చెప్పారు. ఈ చెల్లింపుల ప్రక్రియ ఎలా పనిచేస్తుంది, అసలు ఇలా డబ్బులు పంచడం చట్టబద్ధమేనా అనే అంశాలపై ఇంకా స్పష్టత లేదు. మధ్యంతర ఎన్నికల్లో గెలవడం కోసం ట్రంప్ బహిరంగంగా ఓటర్లకు లంచం ఇస్తున్నారని విమర్శకులు, సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. "రిపబ్లికన్లకు ఓటు వేస్తే వి5,000 ఇస్తాననడం డివిడెండ్ ఎంతమాత్రం కాదు.. అది పక్కా లంచం" అని ఎక్స్ వేదికగా నెటిజన్లు ఆరోపించారు. ప్రముఖ అమెరికన్ స్టాక్ బ్రోకర్ పీటర్ షిఫ్ స్పందిస్తూ.. "ఓటర్లను ఆకట్టుకోవడానికి ట్రంప్ ఈ రకమైన ప్రతిపాదన చేశారు. ఈ ఉచిత డబ్బు కోసం ఫెడరల్ రిజర్వ్ భారీగా కరెన్సీ నోట్లను ముద్రించాల్సి వస్తుంది. ఫలితంగా బైడెన్ హయాంలో చూసిన దానికంటే అతి తీవ్రమైన ద్రవ్యోల్బణం వచ్చే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. ఓట్ల కోసం ట్రంప్ చేసిన ఈ 1 ట్రిలియన్ డాలర్ల వాగ్దానం ఇప్పుడు అమెరికా వ్యాప్తంగా తీవ్ర రాజకీయ, ఆర్థిక చర్చకు దారితీసింది.




# పవన్ ఆదేశాలు బేఖాతరా

### ఆర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం: జయ జయహే: సెప్టెంబర్ 11:**

ఎపి పేపర్ మిల్లు కాలుష్య వ్యవహారంలో కూటమి ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వైఖరిపై రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గోదావరిలో విష రసాయన వ్యర్థాలు కలుపుతున్న మిల్లుకు కొత్త అనుమతులు ఇవ్వడం వల్ల కాలుష్యం మరింత పెరిగిందని ఆరోపించారు. 2027 గోదావరి పుష్కరాలను స్వచ్ఛంగా నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, కాలుష్య నియంత్రణలో విఫలమైందన్నారు. మిల్లుపై రూ.21 కోట్ల జరిమానా విధించినట్లు చెబుతున్న ప్రభుత్వం, 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.21.34 కోట్ల నీటి పన్ను బకాయిలను ఎందుకు వసూలు చేయడం లేదని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ కాలుష్యంపై ఆగ్రహంగా ఉన్నారనే ప్రచారానికి, ప్రభుత్వ చర్యలకు పొంతన లేదన్నారు. మిల్లు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, 2027 పుష్కరాలకు మూడు నెలల ముందే మిల్లును మూసివేసి గోదావరిని పూర్తిగా కాలుష్యరహితంగా చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా, న్యాయ పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్పిసి నాయకులు తిరుపతి వెంకట రవి, పెండ్యాల కామరాజు, కాసా రాజు, సిమ్మా దుర్గారావు, బర్ల ప్రసాద్, డి.వి. రమణమూర్తి, ఎం.డి. హుస్సేన్, దుడ్డే త్రినాథ్, కారుమూరి యుగంధర్, కారుమూరి రామచంద్రుడు, గుడ్ల దుర్గాప్రసాద్, బసా సోనియా, దోషి నిషాంత్, వర్ధనపు శరత్‌కుమార్, వల్లి వెంకటేష్, కాకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# నిత్యావసర సరకులు ధరల పెరుగుదలపై నిరసనలో పాల్గొన్న సబీర బేగం

**విశాఖపట్నం జయ జయహే**

దక్షిణ నియోజకవర్గ సమన్వయ కర్త శ్రీ వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశాలమేరకు 39వార్డు అధ్యక్షులు ఎండీ ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో కోటవీధి,కదిరి దానప్ప అంబుసారంగ్ , సోల్జరుపేట బెల్ట్ ప్రాంతాలలో నిత్యావసర సరుకులు ధరల పెరుగుదలపై పై నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సబీర మాట్లాడుతూ కూరమి ప్రభుత్వం లో నిత్యావసర సరకులు ధరలు విపరీతంగా పెరగడం వలన మధ్యతరగతి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు వెంటనే ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సెక్రటరీ సబీరా బేగం,దక్షిణ నియోజక వర్గ మైనార్టీ అధ్యక్షులు బాబ్జి దక్షిణ నియోజక వర్గ కళింగ వైశ్య అధ్యక్షులు రమణ 39వార్డు ఉపాధ్యక్షులు తి తీ కృష్ణ 39వార్డు జనరల్ సెక్రటరీ సత్య 39వార్డు యువజన విభాగ అధ్యక్షులు అది దక్షిణ నియోజక వర్గ అంగన్వాడీ అధ్యక్షులు ఆదిలష్మి జిల్ల బూత్ కమిటీ సెక్రటరీ ధనరాజు 39వార్డు మైనార్టీ అధ్యక్షులు కమల్ 39 వార్డు స్టూడెంట్ విభాగ అధ్యక్షులు కాసుబాబు 39వార్డు ఆర్ టీ ఐ అధ్యక్షులు చంద్రరావు జిల్లా మైనార్టీ సెక్రెటరీ ఇబ్రహీం 39 వార్డు జనరల్ సెక్రెటరీ వెంకటి జిల్లా మైనార్టీ సెక్రెటరీ సిలార్ 39 వ వార్డు సెక్రెటరీ నూకరత్నం దక్షిణ నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు ఆకుల శ్యామ్ 39 వార్డు సీనియర్ నాయకులు సిరాజున్నిసా దేవి శ్రీను భారతి పరదేశి నూకరత్నం తదితరులు పాల్గొన్నారు..

# లడఖ్‌కు త్వరలోనే ప్రత్యేక హోదా..

### ఆర్టికల్ 371 సవరణకు కేంద్రం కసరత్తు

**జయ జయహే**

గత నాలుగేళ్లుగా లడఖ్ ప్రజలు చేస్తున్న డిమాండ్ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. లడఖ్ ప్రాంతానికి ఆర్టికల్ 371 కింద రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే హిమాలయ ప్రాంతమైన లడఖ్ పాలన కోసం భారతదేశంలోనే మొదటిసారిగా 'సూయీ జెనెరిస్' నమూనాలో ఒక ఎన్నికైన పాలక మండలిని ఏర్పాటు చేయనున్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో లడఖ్ చీఫ్ సెక్రటరీ ఆశిష్ కుంద్రా మాట్లాడుతూ.. లడఖ్‌కు తగిన రాజ్యాంగ పరిరక్షణలు కల్పించేందుకు పార్లమెంట్ ఆర్టికల్ 371ని సవరిస్తుందని తెలిపారు. లడఖ్‌కు రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడం, ఎన్నికైన మండలిని ఏర్పాటు చేసే ప్రక్రియను కేంద్ర హోం శాఖ ఇప్పటికే ప్రారంభించిందని ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 నిర్దిష్ట రాష్ట్రాల ప్రత్యేక ప్రాంతీయ, సామాజిక అవసరాలను తీర్చడానికి తాత్కాలిక, పరివర్తన, ప్రత్యేక అధికారాలను అందిస్తుంది. "మేము ఒక ప్రత్యేకమైన పాలనా నమూనాపై పనిచేస్తున్నాం... ఇది 'సూయీ జెనెరిస్' మోడల్. లడఖ్‌లో ఎన్నికైన పాలక మండలి ఉంటుంది, కానీ ఇది శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగానీ లేదా రాష్ట్రంగానీ కాదు" అని కుంద్రా వివరించారు. 'సూయీ జెనెరిస్' అనేది ఒక ప్రత్యేక పరిస్థితిని నిర్వహించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన చట్టపరమైన వ్యవస్థ. ఈ లాటిన్ పదానికి 'తనదైన శైలి' లేదా 'ప్రత్యేకమైనది' అని అర్థం. లడఖ్ నాయకులతో చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వ బృందంలో ఆశిష్ కుంద్రా భాగస్వామిగా ఉన్నారు.

# వినాయక చవితి వేడుకల్లో నిబంధనలు పాటించాలి.. సీఐ పి.వి.జి.తిలక్

### నిడదవోలు ప్రజలకు పోలీసుల సూచనలు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**




వినాయక చవితి పర్వదినం సందర్భంగా నిడదవోలు ప్రజలకు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వి.జి. తిలక్ ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. వినాయక మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, ఫైర్, విద్యుత్ శాఖల అనుమతులు కూడా తప్పనిసరిగా పొందాలని సూచించారు. మండపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు కమిటీ సభ్యుల జాబితాను పోలీసులకు అందజేయాలని తెలిపారు. మండపాల్లో మైక్ వినియోగానికి అనుమతి తీసుకోవాలని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైక్ వినియోగించాలని సూచించారు. లైటింగ్ వైర్లకు ఎలాంటి అతుకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల్లో ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. విగ్రహం వద్ద అశ్లీల నృత్యాలు, పాటలు నిర్వహించరాదని, నిమజ్జనం సమయంలో రికార్డింగ్ డ్యాన్సులు పెట్టకూడదని స్పష్టం చేశారు. మండపం వద్ద కమిటీ సభ్యుల్లో ఎవరో ఒకరు నిరంతరం అందుబాటులో ఉండాలని, విలువైన వస్తువులను మండపాల్లో ఉంచరాదని సూచించారు. మండపాల వద్ద మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక విగ్రహ నిమజ్జనానికి చిన్న పిల్లలను తీసుకెళ్లవద్దని, మండపాల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని సీఐ తిలక్ సూచించారు. వినాయకుడి చల్లని చూపు నిడదవోలు ప్రజలతో పాటు జిల్లా ప్రజలందరిపై ఉండాలని సీఐ పి.వి.జి. తిలక్ ఆకాంక్షించారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com